సూర్య
www.suryaa.com
రంగారెడ్డి - వికారాబాద్ మేడ్చల్
బుధవారం 12 జూన్ 2024
పేజీలు : 10


## అభివృద్ధి పనులకు ఆలస్యం వద్దు : ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి



మహేశ్వరం,మేజర్‌న్యూస్(జూన్ 11): గత ప్రభుత్వం హయంలో మంజూరైన మున్సిపాలిటీ అభివృద్ధి పనులకు ఆలస్యం వద్దని త్వరగా నిలిచిపోయిన పనులను పున:ప్రారంభించాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మంత్రి నివాసంలో తుక్కుగూడ మున్సిపాలిటీ కమీషనర్ , అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ.... వర్షాకాలం సమీపిస్తున్న సందర్భంగా ప్రజలకు అధికారులందరూ అందుబాటులో ఉండాలని అధికారులకు సూచించారు. సిసి రోడ్లు , అండర్ డ్రైనేజీలు,మంచినీటి వ్యవస్థ సెంట్రల్ లైటింగ్ సిస్టం పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ వెంకట్‌రాం, డిఈ, ఏఈ, కౌన్సిలర్లు బాదావత్ రవినాయక్, రెడ్డిగళ్ల సుమన్, సప్పిడి లావణ్యరాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చదువు... కొనాలా

- జల్ పల్లిలో అడ్డగోలుగా ప్రైవేట్ స్కూల్‌ల వ్యాపారం
- ఫీజులు కట్టలేని పరిస్థితిలో విద్యార్థుల తల్లిదండ్రులు
- ఫీజులు కట్టకుంటే విద్యార్థులకు నో ఎంట్రీ
- ప్రభుత్వం పట్టించుకోవాలి,తల్లిదండ్రుల ఆవేదన




**జల్ పల్లి, మేజర్ న్యూస్ (జూన్ 11):** చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలను మంచి స్కూల్లో... జాయిన్ చేసి ఉన్నత చదువులు చదివించాలని భావిస్తారు. ఇంగ్లీషు మీడియంపై మోజు, కార్పొరేట్ స్కూళ్లపై వ్యామోహంతో ప్రతి ఒక్కరు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలో చేర్పిస్తారు. తల్లిదండ్రుల వీక్ నెస్ ను క్యాష్ చేసుకుంటున్నా చాలా కార్పొరేట్ స్కూల్స్ ఇష్టానుసారంగా ఫీజులను పెంచి, ముక్కు పిండి మరి వసూలు చేస్తున్నాయి. భారీ మొత్తంలో ఫీజులు చెల్లించాలంటూ ఒత్తిడి చేస్తుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జల్ పల్లిలో అడ్డగోలు ఫీజులతో ప్రైవేట్ స్కూల్స్ వ్యాపారం నిర్వహిస్తున్నాయి. ప్రవేట్ స్కూల్ లలో చదువు కోసం విద్యార్థుల తల్లిదం డ్రులు విద్యను కొనే పరిస్థితి నెలకొంది. అధిక ఫీజుల పేరుతో మధ్య తరగతి, నిరు పేదలను పిండి పీల్చిపిప్పి చేస్తున్నాయి. వేల ఫీజులతో సగటు నిరుపేద విద్యార్థి తల్లి దండ్రుల గుండె గుబేల్ మంటుంది. మిగతా 2లో

## ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతగా,అంకితభావంతో పనిచేయాలి

- తల్లి దండ్రుల పాత్రను పోషించాల్సింది మనమే
- జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి వెల్లడి



వికారాబాద్ జిల్లా ప్రతినిధి,మేజర్‌న్యూస్(జూన్11): ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతగా, అంకితభావంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనార్టీ కే జి బి వి వసతి గృహాలు, గురుకులాల నిర్వహణపై సంక్షేమ అధికారులు, గురుకులాల ప్రిన్సపాల్ లు, కేజీబీవీ ప్రత్యేక అధికారులచే ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....ప్రభుత్వ ఉద్యోగులుగా విధి నిర్వహణలో ఎన్నో మంచి పనులు చేసే అవకాశం ఉంటుందని దీన్ని సద్వినియోగం చేసుకొని మనసుకు సంతృప్తినిచ్చే విధంగా మనసు పెట్టి పనిచేయాలన్నారు. ప్రభుత్వం వసతి గృహాల నిర్వహణలో భాగంగా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ ఎంతో డబ్బును వెచ్చిస్తుందని అయినప్పటికీ ఉత్తీర్ణత శాతం అనుకున్న స్థాయిలో లేకపోవడం దురదృష్టకరమని అన్నారు. మనము పొందుతున్న జీతానికి న్యాయం చేస్తున్నామా? పని చేయకపోవడం వల్ల ఈ పిల్లల భవిష్యత్తు ఏంటి అనే కోణంలో ఆలోచించి వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పనిచేయాలని అధికారులకు హితవు పలికారు. మిగతా 3లో



# అక్రమ షెడ్లు నేలమట్టం

- రాంపల్లిలోని అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారుల ఉక్కుపాదం
- తిరిగి నిర్మిస్తే క్రిమినల్ కేసులేనన్న నాగారం మున్సిపల్ కమిషనర్



కీసర,మేజర్ న్యూస్:నాగారం మున్సిపల్ లోని రాంపల్లిలో వెలుస్తున్న భారీ షెడ్లను పలు సెల్లార్లను మున్సిపల్ అధికారులు నేలమట్టం చేశారు. తమకు రాజకీయ పలుకుబడి ఉందని కొంతమంది స్థానిక నేతలు తమ ఇష్టానికి ఎకరాల విస్తీర్ణంలో భారీ షెడ్లను, పలు సెల్లార్లను నిర్మిస్తున్నారంటూ స్థానిక నేతలు కొందరు కలెక్టరేట్లలోని ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన విషయం తెలిసింది. ఈ మేరకు విచారణ చేపట్టిన నాగారం మున్సిపల్ కమిషనర్ రాజేష్ కుమార్ వాటిపై మంగళవారం కొరడా ఝుళిపించారు. మిగతా 3లో

## రూ.5 లక్షలు ఇస్తేనే ఇల్లు కట్టనిస్తాం

### విలేకరుల సమావేశంలో ధరావత్ వెంకటేష్ నాయక్



ఘట్కేసర్, మేజర్ న్యూస్(జూన్, 11): డబ్బులు ఇస్తేనే ఇల్లు కట్టనిస్తామని ఓయూ కాలనీవాసులు తనను వేధిస్తున్నారని ధరావత్ వెంకటేష్ నాయక్ ఆరోపించారు. ఘట్కేసర్ మండలం చౌదరిగుడ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చౌదరిగుడ గ్రామ పరిధిలోని ఓయూ కాలనీ సర్వే నెంబర్ 752లో గల తన ప్లాట్ 259/ఏలో మిగతా 3లో

# సూటిగా ప్రశ్న..... ప్రభుత్వ పాఠశాలలను ఎందుకు తనిఖీ చేయరు....?

★సమాజంలో గుడి తోపాటు బడి మిన్నా... ★జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించండి ★బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రహం శేఖర్



బాలాపూర్ మేజర్ న్యూస్( జూన్ 11): మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను జిల్లా కలెక్టర్ గాను విద్యాశాఖ అధికారులు గాను ప్రజా ప్రతినిధులు మీరు ఎందుకు తనిఖీ చేయరనీ బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రహం శేఖర్ సూటిగా ప్రశ్నించారు...? మంగళ వారం డిప్యూటీ మేయర్ ఇబ్రహీం శేఖర్ ఏర్పాటు చేసిన బడంగ్పేట్ ఆయన చాంబర్లో విలేకరుల సమావేశంలో నిర్వహించి ఆయన మాట్లాడుతూ.... జిల్లా కలెక్టర్, కానీ జిల్లా విద్యాశాఖ అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కానీ ప్రభుత్వ పాఠశాలలను తనిఖీలు చేస్తే వాస్తవాలు బయటికి వస్తాయని అలాంటి వాటిపై చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుంది అని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తే బడుగు బలహీన వర్గాలు ఎస్సీ ఎస్టీ బీసీ విద్యార్థుల శాతం పెరిగి వారు విద్యతో భవిష్యత్తులో మంచి పౌరులుగా తీర్చిదిద్దబడతారని కానీ ఇందుకు ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు అని సూటిగా ప్రశ్నించారు. ప్రతి గ్రామంలో గుడి కొరకు ఎంతోరో దాతలు ముందుకు వస్తారు. ప్రభుత్వ పాఠశాలలు ( బడి) నిర్మాణం కొరకు ఆ దాతలే సహకరిస్తే సమాజంలో గుడి కన్నా బడిలో ఉన్న విద్యార్థులు మిన్నగా ఉంటారని అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి పాఠశాలలను పరిశీలించి పాఠశాల వసతుల గురించి, పాఠశాలలో పరిశుభ్రత అదేవిధంగా అమ్మాయిలకు టాయిలెట్స్ శుభ్రపరచడంలో అటెండర్లు లేక, తాగే నీటి వసతి ప్రభుత్వ పాఠశాలలో ఎంత మెరుగులో ఉన్నాయో తెలుసుకుంటారన్నారు. ప్రజాప్రతినిధుల దృష్టికి తెస్తే లోకల్ బాడీలలో పాఠశాలల భవిష్యత్తు కొరకు ఖర్చు చేసేందుకు తమ వద్ద నిధులు ఉంటాయని అవి వినియోగించి పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఉపయోగపడతాయని, ప్రభుత్వ పాఠశాలలు బాగుపడతాయని అన్నారు. నేను (ఇబ్రహీం శేఖర్ ) రెండు దశాబ్దాల్లో ప్రభుత్వ పాఠశాలల బడుగు బలహీన వర్గాల విద్యార్థుల గురించి ఎన్ని ప్రభుత్వాలు వచ్చిన గాని ప్రభుత్వ పాఠశాలలు మాత్రం పట్టించుకోని నాథుడు కరువయ్యారు. జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ పాఠశాలను సందర్శించి పరిశీలించినట్లయితే కొన్ని కాకుండా కొన్ని ప్రభుత్వ పాఠశాలలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. బడంగ్పేట్ కార్పొరేషన్ లో అభివృద్ధి పనుల గురించి దాదాపు 281 కోట్లు ఖర్చు పెట్టాం కానీ బడికి మాత్రం 20 లక్షలు పెట్టడం సమంజసం కాదన్నారు. కనీసం 1శాతం బడిలో నిర్మాణ గురించి ఖర్చుపెట్టినట్లయితే పేదరికం నిర్మూలన చెందుతుందన్నారు. మేధావులైన పాత్రికేయులుగా మీకు ప్రతి వేసవికాలంలో ప్రైవేటు పాఠశాలలు హాల్ టికెట్లు ఇవ్వడం లేదు అని వార్తలు రాస్తారు, ఆ విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలలకు వెళ్ళవలసిన అవసరం ఏమి వచ్చింది...? ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తే విద్యార్థులు కూడా ప్రభుత్వ పాఠశాలలకు వస్తారు కదా! అని ప్రశ్నించారు. ఇందుకోసం జిల్లా అధికారులు కలెక్టర్ విద్యాశాఖ అధికారితో పాటు ప్రజాప్రతినిధులు పాఠశాలలను ప్రతిరోజు పరిశీలించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దీనితో బడుగు బలహీన వర్గాలకు విద్య ఉచితంగా అందుతుందని దీనితో వారు వేలు లక్షల రూపాయల ఖర్చు చేసి వారి పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపరు కదా? అని ప్రశ్నించారు. దీనిని ప్రతి ఒక్కరూ ఆలోచించాలని ఇబ్రహం శేఖర్ కోరారు.

## తెలుగు ప్రజలను అలరించిన ఆటా 2024 కన్వెన్షన్ - సర్పంచ్‌ల ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీనర్సింహ్మారెడ్డి



కడ్తాల్, మేజర్‌న్యూస్ (జూన్ 11): అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో అట్లాంటా నగరంలో మూడు రోజుల నుండి జరుగుతున్న ఆటా 2024 కన్వెన్షన్ తెలుగు ప్రజలను అలరించాయని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహ్మారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మేజర్‌న్యూస్‌తో ఫోన్‌లో మాట్లాడుతూ ఆటా కన్వెన్షన్‌లో నిర్వాహకులచే ఏర్పాటు చేయబడిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రవాస భారతీయులను అలరించాయని, బిజినెస్ ఫోరం, ఉమెన్ ఎంపవర్‌మెంట్ ఫోరం, పొలిటికల్ ఫోరం, ఎన్నారై కమిటీ ఫోరం, కల్చరల్ ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పలు కార్యక్రమాల ద్వారా విద్యార్థినీ, విద్యార్థులకు తెలుగు సంస్కృతి, సాంప్రదాయాల ప్రాముఖ్యతను, యువకులకు ఉద్యోగ అవకాశాలపై అవగాహన, వ్యాపారస్తులకు పెట్టుబడులపై అవగాహన ఆటా కల్పించినట్లు తెలిపారు. మూడు రోజులపాటు అట్టహాసంగా నిర్వహించబడిన ఆటా 2024 కన్వెన్షన్ ఆదివారంతో ముగిసినట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఆటా 2024 కన్వెన్షన్ ను అట్టహాసంగా నిర్వహించిన ఆటా అధ్యక్షురాలు మధు బొమ్మినేని, మాజీ అధ్యక్షులు కరుణాకర్ ఆసిరెడ్డి, కన్వెన్షన్ డైరెక్టర్ అనిల్ బోదిరెడ్డి, ఆటా బోర్డ్ ఆఫ్ ట్రస్టీ కిషోర్ గూడూరులను కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు చెప్పారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఆటా కన్వెన్షన్ ప్రవాస భారతీయులకు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. భవిష్యత్తులో నిర్వహించబోయే ఆటా కార్యక్రమాలకు తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తామని నిర్వాహకులకు తెలియజేయడం జరిగిందని లక్ష్మీనర్సింహ్మారెడ్డి వెల్లడించారు.

# నార్సింగి మున్సిపాలిటీలో రూ.56.57 కోట్లతో అభివృద్ధికి కౌన్సిల్ ఆమోదం



గండిపేట్, మేజర్‌న్యూస్ (జూన్ 11) : నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో రూ.56.57 కోట్ల అభివృద్ధి పనులకు మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. మంగళవారం కౌన్సిల్ సమావేశంను చైర్మెన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ గోపాల విజయ్‌తో కలిసి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అందులో ప్రధానంగా సీసీ రోడ్లకు రూ.13.52 కోట్లు, భూగర్భ డ్రైనేజీ పనులకు రూ.8.45 కోట్లు, కమ్యూనిటీ హాళ్లకు రూ.22.12, వైకుంఠధామాల అభివృద్ధికి రూ.2.62 కోట్లు, వీధిదీపాల నిర్వాహణకు రూ.2.55 కోట్లు, గ్రీనరీ పనులకు రూ.కోటి, బోర్ మెటీరియల్ పారిశుధ్య కార్మికుల పనిముట్లు, ఇతర పనులకు రూ.6.31 కోట్ల బడ్జెట్‌ను కౌన్సిల్ ఆమోదంతో కేటాయించినట్లు వివరించారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ.. నార్సింగి మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని వెల్లడించారు. ముఖ్యంగా ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో అధిక ప్రాధాన్యతను ఇస్తున్నామని వెల్లడించారు. నార్సింగి మున్సిపాలిటీని రానున్న రోజుల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, డీఈ నర్సింహ్మారాజు, మేనేజర్ యోగేష్, ఇరిగేషన్ డీఈ రమా, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# చదువు.....కొనాలా

మొదటిపేజీ తరువాయి...

జల్ పల్లి మున్సిపాలిటీ పరిధిలో కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు తమకు ఇష్టం వచ్చినట్టుగా ఫీజులు పెంచి పేద విద్యార్థుల తల్లిదండ్రులను ముప్పు తిప్పలు పెడుతున్నారు. మేము కట్టలేము మొర్రో అని తల్లిదండ్రులు ప్రాధేయపడ్డ, ముక్కు పిండి మరి వసూలు చేస్తున్నారు ప్రైవేటు విద్యాసంస్థలు.సర్కార్ నిబంధనలు లెక్కచేయకుండా, విద్యార్థుల ఫీజులు ఇష్టం వచ్చినట్టు పెంచుతున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.జల్ పల్లిలో ప్రైవేట్ విద్య సంస్థలునర్సరీ నుండి యూకేజీ వరకు 20 నుండి 30 వేలు, ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు 30 వేల నుండి 50 వేల వరకు స్కూల్ ఫీజులు వసూలు చేస్తున్నారు.జల్ పల్లి మున్సిపాలిటీ పరిధిలో పేద మధ్యతరగతి వాళ్లే ఎక్కువగా జీవిస్తుంటారు.ఇదే అదునుగా భావించిన కొన్ని విద్యాసంస్థలు తమకు ఎవరు అడ్డు చెప్పారనే ధీమాతో ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచుతున్నాయి. ప్రస్తుతం ఉన్న ఫీజుల కంటే 6 నుంచి 20 శాతం వరకు ఫీజులు పెంచాయి.దానికి తోడు సంవత్సరానికి రెన్యువల్, ఆప్ లా పేరుతో,కంప్యూటర్ కోర్సుల పేరుతో ఎక్స్ ట్రా మనీ లాగుతున్నారు.దీంతో విద్యార్థుల తల్లిదండ్రులపై మోయలేని భారం పడడంతోపాటు,తమ పిల్లల కోసం అప్పులు చేసి మరి ఫీజులు చెల్లించక తప్పడం లేదంటున్నారు.ప్రైవేట్ విద్యాసంస్థల దందా ఇలానే కొనసాగితే రానున్న రోజులు తమ పిల్లల చదువుల కోసం తమ ప్రాణాలను సైతం అర్పించే పరిస్థితి నెలకొంటుందోనేమోనని ఆందోళన చెందుతున్నారు విద్యార్థుల తల్లిదండ్రులు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేట్ విద్యాసంస్థలపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఫీజులు తగ్గించేలా చర్యలు చేపట్టి,పేద,మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు రక్షణగా నిలవాలంటున్నారు.

# సల్మాన్ హత్య పథకం ప్రకారమే

★ సల్మాన్ అడ్డు తొలగించుకునేందుకే సురేందర్ మిత్రులతో కలిసి హత్య

★ ఏ1 నుండి ఏ5 వరకు అరెస్టు చేసి రిమాండ్ తరలింపు



బాలాపూర్ మేజర్ న్యూస్ ( జూన్ 11): గతంలో రౌడీ షిటర్ సల్మాన్ ను హత్య పథకం ప్రకారమే సురేందర్ వారి స్నేహితులతో కలిసి అడ్డు తొలగించుకున్నారు. మీర్పేట్ పోలీస్ స్టేషన్లో మంగళవారం గతంలో జరిగిన రౌడీషీటర్ హత్య విషయం గురించి వనస్థలిపురం ఎసిపి,మీర్పేట సిఐ,ఎస్ఐ మీర్పేట స్టేషన్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. పోలీసులు విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. సల్మాన్ చెల్లెను సురేందర్ హత్య చేశాడని ఉద్దేశంతో ఎప్పటికైనా సురేందర్ ను చంపుతానని అతను ఫ్రెండ్స్ తో సల్మాన్ చెప్పడంతో అతన ఫ్రెండ్స్ సురేంద్రకు ఈ విషయం చెప్పడంతో సురేందర్ ఆందోళన చెందుతూ సల్మాన్ తో ఎప్పటికైనా ప్రమాదం ఉందని అతన్ని అడ్డు తొలగించుకుంటే నాకు ఎలాంటి ప్రమాదం ఉండదని గ్రహించిన సురేందర్ తానే ముందుగా ప్లాన్ చేసి చంపాలనుకొని నేరచరిత్ర కలిగిన తన మిత్రులు బుర్ర అరుణ్, లక్ష్మణ్, స్వర్ణలత,కేటావత్ తరుణ్ లతో కలిసి సురేందర్ పథకం ప్రకారమే రూపొందించాడు స్వర్ణలతల ఎరా గా వాడుకొని అయ్యప్ప స్వామి దేవాలయం వద్దకు సల్మాన్ ని స్వర్ణలత తీసుకొచ్చింది. సుమారు రాత్రి 11 గంటల పది నిమిషాలకు స్వర్ణలత సల్మాను తీసుకురాగానే ఇద్దరు సల్మాన్ ని పట్టుకోగా మరో ఇద్దరు చీకట్లో దాచుకొని అతను రాగానే కత్తులతో దాడి చేసి చంపారు. అనంతరం వారు ఎవరికి దొరకకుండా పారిపోయారు. పోలీసులు టెక్నికల్ ఆధారాలతో పట్టుకోవడం జరిగిందని ఏసిపి కృష్ణయ్య తెలిపారు. అరుణ్ లక్ష్మణ్ అరుణులపై పలు కేసులు నమోదయాయని సురేందర్ పై 39 కేసులు ఉన్నాయని పీడీ యాక్టు నమోదు జైలుకు వెళ్లి వచ్చారని గతంలో సల్మాన్ సురేంద్ర కలిసి పని చేశారని అన్నారు. సల్మాన్ తన చెల్లిని సురేందర్ చంపడమే కాకుండా స్వర్ణలతతో క్లోజ్ గా ఉంటున్నాడు అన్న కోపంతో కక్షతో సురేందర్ చంపాలి అనుకున్నాడు కానీ సురేందర్ సల్మాన్ ను ఫ్రీ ప్లాన్ ప్రకారం మర్డర్ చేశారని మీర్పేట్ సీఐ కాశి విశ్వనాథ్ తోపాటు వనస్థలిపురం ఏసీపి కృష్ణయ్య వెల్లడించారు. ఈ సమావేశంలో డిఐ గౌరీ నాయుడు,ఎస్స సుధకరు పోలీసులు ఎల్లయ్య, నాగేష్, శివరాజ్, అనిల్ రాజు,లందరికీ ఏసీపి అభినందనలు తెలిపారు.

# ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతగా, అంకితభావంతో పనిచేయాలి

*మొదటిపేజీ తరువాయి...*

వసతి గృహాల్లోని విద్యార్థుల ఉత్తీర్ణత ఈ దఫా 70 శాతానికి తగ్గకుండా పని చేయాలని ఆయన తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు కూడా పోటీ పడాలని ఆయన అన్నారు. వసతి గృహాలు, గురుకుల పాఠశాలలకు విద్యార్థులు వచ్చేసరికి పారిశుద్ధ్య పనులు చేపట్టాలాన్నారు. పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు విలువ గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ సిబ్బంది సహకారం తీసుకోవాలని ఆయన సూచించారు.

★తల్లి దండ్రుల పాత్రను పోషించాల్సింది మనమే...

దారిద్రరేఖకు దిగువనున్న ఉన్న గ్రామీణ, మధ్యతరగతి కి చెందిన అత్యంత పేద కుటుంబాల పిల్లలు వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తారని, తల్లిదండ్రుల పాత్రను పోషిస్తూ వారి బాగోగులను చూడాల్సిన బాధ్యత కూడా సంబంధిత అధికారులదేనని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. వసతి గృహాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కనీస అవసరాలైన మంచినీరు , విద్యుత్తు, టాయిలెట్స్, ఫ్యాన్లు, తలుపులు కిటికీలు ఉండే విధంగా ముందస్తుగా చూసుకోవాలని అని తెలిపారు. ఏవైనా మరమ్మతులు ఉంటే నిధుల మంజూరు కాయ్ ప్రతిపాదనలు సమర్పించినట్లయితే అనుమతులు ఇవ్వడం జరుగుతుం దని ఆయన తెలిపారు. వసతి గృహాల్లో సబ్జెక్టుల వారీగా ట్యూటర్లను నియామ కం చేసుకొని రాజీ పడకుండా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే దుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఉత్తీర్ణత పైన మంచి విశ్వాసాన్ని తీసుకువచ్చి మంచి ఫలితాలు సాధించేలా పని చేయాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి మల్లేశం, వెనుకబడిన కులాల అభివృద్ధి అధికారి ఉపేందర్, టిజీఎస్ డబ్ల్యూఆర్ ఈఐఎస్ రీజినల్ కోఆర్డినేటర్ శారద వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.5 లక్షలు ఇస్తేనే ఇల్లు కట్టనిస్తాం

ఇంటి నిర్మాణం చేపట్టేందుకు పనులు ప్రారంభించగా కొందరు స్థానికులు, పలువురు నాయకులు లేనిపోని ఫిర్యాదులు చేసి పనులను ఆపించారని, ఇదేమిటని ప్రశ్నించగా రూ.ఐదు లక్షల ఇవ్వాలని డిమాండ్ చేశారని ఆరోపించారు. అన్ని అనుమతులు తీసుకొని తన స్థలంలో తాను నిర్మాణం చేపడుతుంటే కొందరు వ్యక్తులు చేస్తున్న తప్పుడు ఫిర్యాదులకు అధికారులు పనులను ఆపించడం సరికాదన్నారు. డబ్బులు డిమాండ్ చేసిన వ్యక్తులపై ఇప్పటికే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు వెంకటేష్ నాయక్ తెలిపారు. తప్పుడు ఫిర్యాదుల ఆధారంగా తన ఇంటి నిర్మాణ పనులను ఆపవద్దని, ఇలానే వ్యవహరిస్తే ఆధారాలతో సహా బట్టబయలు చేస్తానని హెచ్చరించారు.

## అక్రమ షెడ్లు నేలమట్టం

*మొదటిపేజీ తరువాయి...*



షెడ్లు, సెల్లార్లు సంబంధించి పూర్తి వివరాలు సేకరించి వాటికి ఎలాంటి అనుమతి లేవని గుర్తించి జెసీబీ సాయంతో వాటిని తొలగించాలని కిందిస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. దీంతో మున్సిపల్ సిబ్బంది కమీషనర్ గారి ఆదేశాల మేరకు నాగారం మున్సిపల్ పరిధిలోని రాంపల్లిలో అనుమతి లేకుండా నిర్మాణం చేస్తున్న 3 షెడ్లను, 2 సెల్లార్లను మరియు నాగారం లో 1 షెడ్డును కూల్చివేశారు. కూల్చిన షెడ్లను, సెల్లర్ పనులను తిరిగి నిర్మాణాలను చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కమిషనర్ హెచ్చరించారు. కూల్చివేతల సమయంలో షెడ్ల నిర్మాణదారులు కొంత అలజడి చేసే ప్రయత్నం చేసినా అధికారులు వెనకడుగు వేయకుండా పోలీస్ బందోబస్తుతో ఉక్కుపాదంతో ముందుకు సాగారు. ప్రతి నిర్మాణదారుడు మున్సిపల్ అనుమతులు పొందిన తర్వాతనే నిర్మాణాలు చేసుకోవాలని సూచించారు. కూల్చివేతల్లో టిపిఎస్ కావ్య, మున్సిపల్ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.







# విద్యార్థులకు పెన్ నెంబర్ తప్పనిసరి

- అన్ని రిజిస్టర్లలో నమోదు చేయాలి
- డి.ఈ.వోలకు సమగ్ర శిక్షా అభియాన్ ఆదేశం
- 12 నుంచి పాఠశాలలు ప్రారంభం

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (జూన్ 11): ఈ విద్యా సంవత్సరం నుంచి జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల నుంచి ఇంటర్మీడియేట్ కళాశాలల వరకు అన్ని విద్యా సంస్థల యజమాన్యాలు తప్పని సరిగా తమ విద్యార్థులు పర్మినెంట్ ఎడ్యుకేషన్ నెంబర్ (పెన్ నెంబర్)ను అడ్మిషన్ రిజిస్టర్, అటెండెన్స్ రిజిస్టర్ టీ.సీలు, రికార్డ్ షీట్లు, మెమోలు, హాల్ టికెట్స్ తదితర అన్ని రికార్డ్స్ పైనా ముద్రించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సమగ్ర శిక్షా భియాన్, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ జిల్లా విద్యా శాఖ అధికారికి ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా, దీనిని పక్కాగా అమలు చేయాలని కూడా విద్యా సంస్థలకు ఆదేశాలు జారీ చేయాలని సూచించింది.

**పెన్ అంటే...:** ప్రి ప్రైమరీలో అడ్మిషన్ తీసుకున్నసమయంలో విద్యార్థి పేరు, పుట్టిన తేదీ,తల్లిదండ్రుల పేర్లు, కులం, ఇంటి అడ్రస్‌వంటి అన్ని వివరాలను డిజిటలైజ్ చేసి కేంద్ర పాఠశాల విద్య మంత్రిత్వ శాఖఆధ్వర్యంలోని 'యూనిఫైడ్ డిసిక్ఇన్ఫర్మేషన్ ఫర్ఎడ్యుకేషన్(యూడైస్)'లో నమోదు చేస్తారు. ఒకటోతరగతిలో విద్యార్థుల వివరాలు నమోదుచేసే సమయంలోనే ప్రతి ఒక్కరికీ డిజీలాకర్ను ఓపెన్ చేసి, అన్ని సర్టిఫికెట్లను అందులో ఉంచుతారు. ఆ తర్వాత 11 అంకెల పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్ వస్తుంది. ఉదాహరణకు నగరంలోని ఓ పాఠశాలలో నాలుగో తరగతిచదువుతున్న ఓ విద్యార్థి కుటుంబం ఒక రాష్ట్రానికివలస వెళ్లింది. బాలుడు ఇక్కడ టీసీ తీసుకోలేదు. అయితే,ఆ విద్యార్థి అక్కడ బడిలో చేరినట్టు ఎక్కడావివరాలు లేవు. ఇలాంటి పరిస్థితి విద్యాశాఖకు సవాలే. బడి ఈడు పిల్లలు ఎంతమంది బడిలో ఉంటున్నారు.. బడికి వెళ్లడంలేదోతెలుసుకునేందుకు ఇంటింటికీ సర్వేచేయడం తప్ప ఇప్పటివరకు మరో మార్గంలేదు. 'పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్ (పెన్)'తో దీనికి పరిష్కారం లభిస్తుంది. నూతనజాతీయ విద్యావిధానం 2020 (ఎన్ఐపీ)లో భాగంగా కేంద్ర ప్రభుత్వం దేశంలోని విద్యార్థులందరికీ ఈ ప్రత్యేక గుర్తింపు సంఖ్య పెన్ను తప్పనిసరి చేసింది. ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వం 2024-25 అమలు చేస్తుంది.

**12 నుంచి పాఠశాలల ప్రారంభం:**

ప్రస్తుతం విద్యా సంవత్సరం ఈ నెల 12(నేటి) నుంచి ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యం లో పాత విద్యార్థులు పై స్కూళ్లకు వెళ్లనుండగా, కొత్త విద్యార్థులు కింది స్కూల్లో చేరనున్నారు. ఈ క్రమంలో ప్రతి విద్యార్థికి ఒక పెన్ నెంబర్ ఇచ్చి, దానిని రికార్డుల్లో నమోదు చేస్తే మొత్తం విద్యార్థుల సంఖ్య తేలడంతో పాటు ఏ విద్యార్థి ఎక్కడ ఉన్నాడో స్పష్టమౌతుంది. అందువల్ల దీనిని తప్పనిసరిగా అమలు చేయాలనే 'డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్' రాష్ట్ర సమగ్ర శిక్షా అభియాన్ జిల్లా



విద్యా శాఖ అధికారులకు అమలు చేయాలని చెబుతోంది.

**మేడ్చల్ జిల్లాలో పది లక్ష లకు పైగా స్కూల్, ఇంటర్ విద్యార్థులు:**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో మొత్తం ప్రభుత్వ స్కూళ్లు 505, ప్రైవేట్ స్కూళ్లు 2 వేల వరకు ఉన్నాయి. ప్రభుత్వ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులు దాదాపు గా 90 వేల వరకు ఉండగా, ప్రైవేట్ పాఠశాలల్లో చదువు తున్న విద్యార్థినీ, విద్యార్థుల సంఖ్య దాదాపుగా 9 లక్షల కు పైనే ఉంటుంది. దీనికి తోడు ప్రభుత్వ ఇంటర్మీ డియట్ కాలేజీలు 6, ప్రైవేట్ ఇంటర్మీడియెట్ కాలేజీలు 200 పైనా ఉన్నాయి. వీటిలో విద్యార్థుల సంఖ్య కూడా లక్షకు పై మాటే. వీరు ఏయే కాలేజీలో ఉన్నదీ, వారికి ఆయా స్కూల్ మేనేజీమెంట్లు, కాలేజి మేనేజిమెంట్లు కల్పిస్తున్న సౌకర్యాలు ఎలా ఉన్నాయనే వివరాలను ప్రభుత్వం యూడైస్ ద్వారా సేకరిస్తోంది. అలాగే, ఏ సంస్థలో ఎంత మంది విద్యార్థులు ఉన్నదీ, అలాగే బడి బయట ఎంత మంది ఉన్నదీ లెక్క తేలాలంటే పెన్ నెంబర్ తప్పనిసరి అని విద్యా శాఖ ఉన్నతాధికారులు భావిస్తున్నారు. దానిలో భాగంగానే 2024-25 విద్యా సంవత్సరం నుంచి దీనిని పక్కాగా అమలు చేయాలని కోరుతున్నారు.

# న్యాయ పరిపాలనలో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

## జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి వినోద్ కుమార్



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (జూన్ 11): న్యాయ పరిపాలనలో శిక్షణ పొందగోరే రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాలకు చెందిన అర్హులైన ఎస్సీ లా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి జి. వినోద్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన ఈ మేరకు ఒక పత్రికా ప్రకటన విడుదల చేస్తూ, సెంట్రల్ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ గుర్తించిన ఇన్ స్టిటూషన్స్, సెంట్రల్ యాక్ట్ లేదా, ప్రొవిజనల్ యాక్ట్ కింద ఇన్ కార్పొరేషన్ చేయబడిన, స్థాపించబడిన ఏదేని యూనివర్సిటీ నుంచి ఫ్యాకల్టీలో బేసిక్ డిగ్రీ, లా డిగ్రీ పొందిన అర్హులు ఇందుకు అర్హులని ఆయన పేర్కొంటూ, 1 జూలై -2024 నాటికి 23 సంవత్సరాలు నిండిన అభ్యర్థులు, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2 లక్షలు మించని అభ్యర్థులు, గతంలో ఈ సౌకర్యాన్ని వినియోగించుకొని వారు మాత్రమే దీనికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపిక చేయబడిన అభ్యర్థులకు న్యాయ పరిపాలనలో మూడు సంవత్సరాల పాటు శిక్షణ ఇవ్వడంతో పాటు ప్రతీ నెల రూ.3 వేలు స్టైఫండ్ కూడా ఇస్తారన్నారు. అలాగే, అభ్యర్థులకు మొదటి సంవత్సరంలో రూ.50 వేలు ( డిజిటల్ బుక్స్, కంప్యూటర్, ఫర్నిచర్, లాయర్ డ్రెస్ కు ) మంజూరు చేస్తారన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 7 నుంచి వచ్చే నెల జులై 6వ తేదీ వరకు ఆన్లైన్లో https://telanganaepass వెబ్ సైట్ నందు రిజిస్టర్ చేసుకోవాలన్నారు. వచ్చే నెల 15న, నిర్వహించే ఇంటర్వ్యూకు ఒరిజనల్ సర్టిఫికెట్లతో, జిల్లా సెలక్షన్ కమిటీ రంగారెడ్డి కలెక్టరేట్ ముందు హాజరు కావాలని వినోద్ కుమార్ సూచించారు.

# విత్తనాలను ఎక్కువ ధరకు అమ్మితే చర్యలు తప్పవు

- డీలర్లు ప్రభుత్వ నిబంధనలను పాటించాలి
- ఫర్టిలైజర్ షాప్‌లను తనిఖీ చేసిన వ్యవసాయ సంచాలకులు ఎల్. వినోద్ కుమార్, మండల వ్యవసాయ అధికారి ఎం. జ్యోతి




రికార్డులను తనిఖీ చేస్తున్న అధికారి ఎల్. వినోద్ కుమార్

వికారాబాద్ మేజర్‌న్యూస్ (జూన్ 11): వికారాబాద్ పట్టణంలో ఉన్న ఫర్టిలైజర్ షాప్ డీలర్లు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని వ్యవసాయ సంచాలకులు ఎల్. వినోద్ కుమార్, మండల వ్యవసాయ అధికారి ఎం. జ్యోతి తెలిపారు. మంగళవారం సూర్య ధినపత్రికలో 'రేవంత్ సీడ్ రూ. 2000' అనే కథనానికి స్పందిస్తూ పట్టణంలో వివిధ ఫర్టిలైజర్ షాప్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... డీలర్లు పత్తి విత్తనాలను ఎక్కువ ధరకు అమ్మితే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రైతులు కొనుగోలు చేసిన వస్తువులకు కచ్చితంగా రషీద్ ఇవ్వాలని తెలియజేశారు. అదే విధంగా డీలర్లు తమ లైసెన్సు వివరాలను, విత్తన వివరాలను షాప్ ముందు బోర్డుపై ప్రదర్శించాలన్నారు. విత్తనాల నిల్వలు ఏఏ కంపెనీ విత్తనాలు అందుబాటులో ఉన్నాయో వాటి ధరల పట్టికను ప్రతి రోజు బోర్డు పై ప్రదర్శించాలన్నారు.




షాప్‌ను తనిఖీ చేస్తున్న ఎఓ ఎం. జ్యోతి.

# ప్రజలకు సరఫరా చేయాల్సిన నీటిని పక్కదారి పట్టిస్తున్న జలమండలి అధికారులు

## – అపార్టుమెంట్లు, విల్లాలకు సరఫరాపై కౌన్సిల్ సమావేశంలో మండిపడ్డ కౌన్సిలర్ ఉషారాణి



గండిపేట్, మేజర్‌న్యూస్ (జూన్ 11) : ప్రజా ప్రతినిధులు ఫోన్లు చేసినా జలమండలి అధికారులు పట్టించుకోవడం లేదని నార్సింగి మున్సిపాలిటీ కౌన్సిలర్ ఉషారాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో జలమండలి అధికారుల తీరుపై కౌన్సిలర్ అసహనం వ్యక్తం చేశారు. అనంతరం కౌన్సిలర్ మాట్లాడుతూ.. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని నార్సింగి గ్రామంలోగత కొన్ని నెలలుగా మంచినీటి సరఫరా సరైన విధంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జలమండలి అధికారులకు ఈ విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. ఇదే అంశాన్ని కౌన్సిల్ సమావేశంలో ప్రశ్నించేందుకు కౌన్సిలర్ సిద్ధం కాగా జలమండలి అధికారులు గైర్హాజరు అయ్యారు. అటు ప్రజలకు, ఇటు ప్రజా ప్రతినిధుల ఫిర్యాదులకు సమాధానం ఇవ్వడం లేదని, ప్రజా సేవకై పని చేయాల్సిన అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. నీటి సరఫరాలో పక్షపాత ధోరణి వహిస్తున్నారని అన్నారు. విల్లాలు, అపార్టుమెంట్లు ఉన్న ప్రాంతాల్లో వారికి ప్రాధాన్యతను ఇచ్చి పేదలు నివసించే ప్రాంతాల్లో నీటి సరఫరా చేయడం లేదని తెలిపారు. వారి వ్యవహార శైలీ మారకపోతే జలమండలి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ప్రజలకు నీటి సరఫరా కాక చాలిచాలని వచ్చే జీతాలతో నీటి ట్యాంకర్లను కొనుగోలు చేస్తున్నారని ఆమె వెల్లడించారు. ఈ విషయంపై కమిషన ర్ ప్రత్యేక దృష్టి సారించి మంచినీటి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కౌన్సిలర్ల తరపున ఆమె కోరారు.

# ఆశావర్కర్లకు పరీక్ష నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి

## –సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్

చేవెళ్ల,మేజర్‌న్యూస్(జూన్ 11) :ఆశావర్కర్లకు పరీక్ష పెట్టే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసహరించుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. బుధవారం ఆశావర్కర్లతో కలిసి జిల్లా ఉపవైద్యాధికారికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఆశా కార్యకర్తలకు నష్టం కలిగించే పరీక్ష నిర్ణయాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. గత 33సంవత్సరాలుగా ఆశావర్కర్లు విధులు నిర్వహిస్తున్నారని, ప్రభుత్వం చేపడుతున్న అన్ని కార్యక్రమాల్లో సేవలు అందిస్తున్నారని తెలిపారు. కరోనా మహమ్మారి కాలంలో కరోనాను నియంత్రించడంలో ఆశాకార్యకర్తలు కీలక పాత్ర పోషించారని, డబ్ల్యూహెచ్‌వో ఆశావర్కర్లకు అవార్డు కూడా ప్రకటించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పరీక్ష పెట్టాలని చూస్తుందని, ఆ నిర్ణయాన్ని రద్దు చేయని పక్షంలో 13వ తేది కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఆశావర్కర్లు



యూనియన్ సీఐటీయూ చేవెళ్ల మండల అధ్యక్షకార్యదర్శులు అన్నపూర్ణ, విజయలక్ష్మి, కోశాధికారి ఉమా, మంజుల, శాంత సుజాత, పావని, సుజాత, శోభారాణి తదితరులు ఉన్నారు.

# ఆశావర్కర్ల కలెక్టరేట్ ముట్టడి విజయవంతం చేయాలి

## ★సీఐటీయు మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్



కందుకూరు, మేజర్‌న్యూస్ ( జూన్ 11): ఆశావర్కర్లకు పరీక్ష విధానాన్ని రద్దు చేయాలనే పిలుపుతో ఈ నెల 13న జిల్లా కలెక్టర్ ముట్టడి విజయవంతం చేయాలని సీఐటీయు మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆశావర్కర్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు రాధికకు వినతిపత్రం అందజేస్తూ.. గత 20 సంవత్సరాల నుండి గ్రామాలలో ప్రజలకు సేవలు అందిస్తున్న ఆశవర్కర్లకు పరీక్షలు పెట్టడం సరికాదని అన్నారు. ఈఎస్ఐ,పీఎఫ్, ఐదు లక్షల ప్రమాద భీమాతో పాటు 26 డిమాండ్లను పరిష్కరించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాకముందు సీఏం రేవంత్‌రెడ్డి ఆశాల సమస్యలు పరిష్కరిస్తామని తెలిపిన, నేటికి ఆరు నెలలు పూర్తి అవుతున్న ఇప్పటికి సమస్యలపై స్పందించకపోవడం దారుణమన్నారు. ఇకనైనా తెలంగాణ ప్రభుత్వం ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలోమండల ఆశావర్కర్లు పాల్గొన్నారు.

# కలకొండ ఫిలిం సమర్పించు

**▶▶ మన కుటుంబం సినిమా షూటింగ్ ▶▶ కుటుంబ ఎమోషన్స్ కూడుకున్న కథకు బలం ▶▶ దర్శకుడు కలకొండ నరసింహ వెల్లడి**



యాచారం మేజర్ న్యూస్ ( జూన్ 11): కలకొండ ఫిలిం పథకం పై సమర్పించు రవివర్మ హీరోగా, లాస్య హీరోయిన్ గా ఆకుల రాఘవ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా మన కుటుంబం. ఇబ్రహీంపట్నం లో జేపీ వెంచర్ లో ఈ చిత్రం శరవేగంగా షూటింగ్ జరుగుతుంది. దాదాపు విచిత్రం పూర్తి అయ్యింది. ఈ చిత్రంలో సుమన్, మురళి గౌడ్, అన్నపూర్ణ, జబర్దస్త్ టీం మురళి, వెంకటేష్ లు పాత్రలు పోషిస్తున్నారు. నిర్మాత కలకొండ నరసింహ, నీమా చౌదరి . నటించిన చిత్రంలో ఫ్యామిలీ డ్రామా, ఎమోషన్స్ తో కూడుకున్న కథ బలం ఉన్న చిత్రం ఈ చిత్రంలో ఇప్పటికీ నాలుగు పాటలు పూర్తి చేసుకున్నారు. ఈ ఈ చిత్రానికి పాటలు పాడిన వారు వందేమాతరం శ్రీనివాస్, నల్లగొండ గద్దర్, ఇతరులు సింగర్స్ పాటలు బాగా పాడారు. నిర్మాత కలకొండ హేమలత, సంగీతం బా న్ ప్రసాద్, ఎడిటర్ బాబి, డిడిపి జగదీష్, కథ స్క్రీన్ ప్లే: కలకొండ నరసింహ ఈ సినిమా షూటింగ్ రేపటితో ముగింపు దశకు వచ్చిందని తెలిపారు. ఈ సినిమాను ఆడియోస్ అందరు చూసి ఎంజాయ్ చేయాలని, మా యూట్యూబ్ ఛానల్ ను ఆదరించాలని దర్శకనిర్మాతలు కోరారు. మా చిత్రానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

# పదవ తరగతి విద్యార్థులకు కెరియర్ అవగాహన సదస్సు



షాబాద్, మేజర్ న్యూస్ :షాబాద్ మండలంలో మంగళవారం జడ్.పి.హెచ్.ఎస్ పోతుగల్ ,తాళ్లపల్లి, హైతాబాద్ , రేగడిదోస్వాడ ఉన్నత పాఠశాల్లలో యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాదు ఆకృతి ప్రాజెక్టు వారు పదవ తరగతి పూర్తయిన విద్యార్థులకు మరియు వారి తల్లిదండ్రులకు కెరియర్ కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగిరెడ్డి,రాజ పాల్ సింగ్,వసంత,అంజయ్య, మాట్లాడుతూ... విద్యార్థుల కెరియర్ ను నిర్ణయించుకోవడానికి మీరు ఇచ్చే ఈ కౌన్సిలింగ్ చాలా ఉపయోగపడుతుందని మా పాఠశాలలకు ఈ కౌన్సిలింగ్ ఇచ్చినందుకు చాలా సంతోషంగా ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆకృతి ప్రాజెక్టు డిస్టిక్ కో ఆర్డినేటర్ శ్రీనివాసులు మరియు ప్రాజెక్టు లీడ్ సద్దాం హుస్సేన్ ఫీల్డ్ ఆఫీసర్లు పవిత్ర,భిక్షపతి,రామకృష్ణ ,సంతోష్,నవిత మరియు కంప్యూటర్ ఆపరేటర్ వేణు పాల్గొనడం జరిగింది.

# పాఠశాలలకు ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ



చేవెళ్ల,మేజర్‌న్యూస్(జూన్ 11) :మండలంలోని 2024-25 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలలకు విద్యాశాఖ సిబ్బంది పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. సోమవారం చేవెళ్ల మండల కేంద్రంలో ఉర్దూ మీడియం పాఠశాలలో ఉపాధ్యాయులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ విద్యా సంవత్సరానికి 30వేలపై చిలుకు పాఠ్యపుస్తకాలకు గాను 15090 పాఠ్యపుస్తకాలను పాఠశాలలకు పంపిణీ చేశారు. బుధవారం విద్యా సంవత్సరం మొదలవుతుండడంతో అన్ని పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు అందాయని తెలియజేశారు. ఈకార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీ క్రిష్ణ, శంకర్, శ్రీనివాస్, నర్సింలు తదితరులు ఉన్నారు.

# కేంద్ర మంత్రి, ఎంపీలను కలిసిన బీజేపీ నాయకులు



చేవెళ్ల,మేజర్‌న్యూస్(జూన్ 11) :కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, చేవెళ్ల, మల్కాజిగిరి ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్‌లను బుధవారం చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కె.ఎస్ రత్నం ఆధ్వర్యలలో బీజేపీ జిల్లా కార్యదర్శి గుండన్నగారి వెంకట్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, డా.వైభవ్‌రెడ్డి, త్రినేత్రలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం, శాలువతో సన్మానించారు.

# తెలంగాణ సహకార బ్యాంక్ ఉపాధ్యక్షునికి శుభాకాంక్షలు



కందుకూరు, మేజర్‌న్యూస్ ( జూన్ 11): తెలంగాణ రాష్ట్ర సహకార బ్యాంక్ ఉపాధ్యక్షులుగా హైద్రాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ అధ్యక్షుడు కొత్తకుర్మ సత్తయ్య ఎన్నికైనారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర సహకార బ్యాంక్ కార్యాలయంలో డీసీసీబీ కార్యవర్గ సభ్యులు దేవరశెట్టి చంద్రశేఖర్,పట్లోళ్ల లక్ష్మారెడ్డిల ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ డైరెక్టర్లు బి.సతీష్, పి.అంజిరెడ్డి, ఎస్.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, ఎం.బాల్‌రెడ్డి,ఎస్,రవిందర్ గౌడ్, పి.రామ్‌రెడ్డి, కె.శ్యామ్ సుందర్ రెడ్డిలు పాల్గొన్నారు.

# యాచారం వైస్ ఎంపీపీకి పితృవియోగం

## గునుగల్ లో ఉదయం 11 గం. అంత్యక్రియలు



యాచారం మేజర్ న్యూస్ ( జూన్ 11): యాచారం వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి తండ్రి కొడవటి కంటి లక్ష్మారెడ్డి కొంతకాలం అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం సాయంత్రం 4 గంటలకు మరణించారు. తండ్రి మరణ వార్త తెలుసుకొని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తన ఇంటికి చేరుకొని సంతాపం తెలిపారు. నేడు తన స్వాహ గృహం గునుగల్ లో ఉదయం 11 గంటలకు అంత్యక్రియలు జరుగుతాయి. అంత్యక్రియలకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ప్రజాపతినిధులు హాజరవుతున్నారని తెలిపారు.

# పేద ప్రజల కోసం ప్రభుత్వం ఎన్నెన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తుంది

● ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి
● తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి వెల్లడి



చెక్‌లను ఇస్తున్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి.

తాండూరు,మేజర్‌న్యూస్(జూన్ 11):తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం నిరంతరం ఎన్నెన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, ప్రతి ఒక్కరూ ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. తాండూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం నాడు తాండూరు టౌన్, తాండూరు, పెద్దేమూల్ మండలాలకు చెందిన 237మంది లబ్ది దారులకు రెండు కోట్ల 37లక్షల 27వేల 492రూపాయల విలువ గల కల్యాణాలక్ష్మీ,షాదీముభాకర్ చెక్ లను ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఇచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అన్నీ వర్గాల ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం మేలు చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్ రావు, తహశీల్దార్ తరాసింగ్, మున్సిపల్ చైర్మన్ స్వప్న,నేతలు ధారాసింగ్, ప్రభాకర్ గౌడ్, వివిధ మండలాల కు చెందిన అధికారులూ, లబ్దిదారులు పాల్గొన్నారు.అదే విధంగా తాండూరు మండలానికి చెందిన నేతలు తాండూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జె. నాగప్ప, ఉత్తమ్ చంద్, ఎంపీపీ సంగెం అనిత రవి గౌడ్, గౌతాపూర్ రామచంద్ర రెడ్డి,శ రన్ బసప్ప, జెర్నప్ప,కోతి గోపాల్, హరీశ్వర్ రెడ్డి,చంద్రవంచ విజయ్ కుమార్, నర్సింలు,చెంగోల్ ఎంపీటీసీ భర్త రాము,ప్రవీణ్ గౌడ్,శ్రీనివాస్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.



చెంగోల్ గ్రామానికి చెందిన లబ్ధిదారులకు చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి.

# వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

● లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి ● మాన్‌సూన్ అత్యవసర బృందాలు అప్రమత్తంగా ఉండాలి ● వాటర్ లాగింగ్ పాయింట్లపై ప్రత్యేకమైన నిఘా ● మూడు అత్యవసర బృందాల ఏర్పాటు ● అధికారులు సమన్వయంతో సమస్యలు పరిష్కరించాలి ● పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి

మేడిపల్లి మేజర్ న్యూస్ (జూన్ 11): రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని మాన్సూన్ అత్యవసర సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి అన్నారు.వరదలు వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కమిషనర్ త్రిశేశ్వర్ రావు, మున్సిపల్ అధికారులు, వార్డ్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా అన్నిరకాల చర్యలు తీసుకోవాలని అధికారులను మేయర్ ఆదేశించారు.వరదలతో లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకునేందుకు 3 షిఫ్ట్ ల్లో పనిచేయుటకు 3మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్ లను ఏర్పాటు చేశారు.గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని లోతట్టు ప్రాంతాలు, నీరు నిల్వ ప్రాంతాలను గుర్తించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా అవసరమైన చోట సూచిక బోర్డులు, ఓపెన్ నాలాల వద్ద ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. రోడ్లు, కల్వర్టులు,డ్రైనేజి, కాలువలలో పూడికలు తొలగించి నీటి ప్రవాహం సాఫీగా సాగేలా చూడాలన్నారు. అధికారులు అందరు సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు ఈ కార్యక్రమంలో ఆర్వో శ్రీనివాస్ రెడ్డి, మేనేజర్ జ్యోతి, ఏఈ బిక్షపతి, మున్సిపల్ అధికారులు, వార్డ్ ఆఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీర్జాదిగూడ మేయర్‌జక్క వెంకట్ రెడ్డి



# చట్ట విరుద్ధంగా పశువులను రవాణా చేస్తే కఠినచర్యలు

● చెక్ పోస్టలలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి
● ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలి
● జిల్లా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి





చెక్ పోస్టు వద్ద పోలీస్ నిఘా

ధారూర్, మేజర్ న్యూస్ (జూన్ 11): చెక్ పోస్ట్ లలో సిబ్బంది ఎప్పుడు అప్రమత్తం గా ఉండి విధులు నిర్వర్తించాలనిజిల్లా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి సిబ్బందికి సూచించారు.మంగళవారం ధారూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బక్రీద్ పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా చెక్ పోస్ట్ లలో ఏర్పాటు చేసిన రిజిస్టర్ లను పరిశీలించి చెక్ పోస్టలో విధులు నిర్వహిస్తున్న అధికారులకు,సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు.చెక్ పోస్ట్ లలో విధులు నిర్వహించే అధికారులు ఎల్లప్పుడు అప్రమత్తంగా విధులలో పాల్గొనాలని,ప్రతి ఒక్క వాహనాన్ని తనిఖీ చేయాలని తెలిపారు.ఎవరైనా చట్టవిరుద్ధంగా పశువులను రవాణా చేస్తే వెంటనే ఉన్నత అధికారులకు తెలియజేయాలనీ సూచించారు. రవాణా చేయు పశువులకు ఫిట్ ఫర్ ట్రాన్స్పోర్ట్ సర్టిఫికెట్ ఖచ్చితంగా ఉందా లేదా చూడాలని అన్నారు. జంతువులను రవాణా చేసే వ్యాపారాలు పరిమితిని మించి జంతువులను ఒకే వాహనంలో తరలిస్తే ఆ వాహనాలను సీజ్ చేయాలని ఆయన పోలీస్ సిబ్బందికి తెలిపినారు.వీరితో పాటు ధారూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రామ కృష్ణ,జిల్లా డీఎస్బీ ఇన్స్పెక్టర్ డివిపి రాజు,ఎస్సై వేణుగోపాల్ గౌడ్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు లక్కీ డ్రా ద్వారా విద్యార్థులు ఎంపిక

వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి,మేజర్‌న్యూస్(జూన్11): బెస్ట్ అవైలేబుల్ పాఠశాలలో వున్న ఖాళీల ప్రవేశాలకు లక్కీ డ్రా ద్వారా విద్యార్థుల ఎంపిక చేయడం జరిగిందని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బెస్ట్ అవైలేబుల్ పారాశాలలలో 1వ తరగతి నాన్ రెసిడెన్షియల్, 5వ తరగతిలో రెసిడెన్షియల్ ప్రవేశాల కోసం అర్హులైన షెడ్యూల్డ్ కులాల విద్యార్థిని, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడం జరిగిందని, ఇందులో భాగంగా జిల్లాకు మొత్తం 88 నాన్ రెసిడెన్షియల్ ఖాళీలకు గాను 135 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడం జరిగిందని, అందులో 88 మంది విద్యార్థులను జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో లక్కి డ్రా ద్వారా ఎంపిక చేశారు.అదేవిధంగా 91 (ఐదవ తరగతి) రెసిడెన్షియల్ సీట్లకు గాను దరఖాస్తు చేసుకున్న 23 మంది విద్యార్థులను నేరుగా ఎంపిక చేయడం జరిగిందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి మల్లేషం,తదితరులు పాల్గొన్నారు.

# ఆవులు లేగ దూడల అక్రమ రవాణా నిషేధం

జిల్లా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి



వికారాబాద్ మేజర్‌న్యూస్ (జూన్ 11): వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో బక్రీద్ పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను జిల్లా అదనపు ఎస్పీ. రవీందర్ రెడ్డి పరిలిశించారు. ఆయన మాట్లాడుతూ... పశువులను రవాణా చేసే వ్యక్తులు పశువుల ట్రాన్స్పోర్ట్ కు సంబందించిన అన్ని రకాల నియమాని బంధనలు పాటించాలన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఆవులు, లేగ దూడల రవాణా చేయరాదని రవాణా చేయు పశువులకు ఫిట్ ఫర్ ట్రాన్స్పోర్ట్ సర్టిఫికెట్ ఖచ్చితంగా కల్గి ఉండాలన్నారు. జంతువులను రవాణా చేసే వ్యాపారాలు పరిమితిని మించి జంతువులను ఒకే వాహనంలో తరలించవదని తెలిపారు. జంతువుకు జంతువుకు దూరం ఖచ్చితంగా పాటించాలన్నారు. పోలీస్ సిబ్బంది కూడా ఎక్కడ నిర్లక్ష్యం చేయకుండా అన్ని వాహనాలు తనిఖీలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌బి ఇన్స్పెక్టర్ డివిపి రాజు తదితరులు పాల్గొన్నారు.

# క్యాబ్ వైస్ చైర్మన్‌గా సత్యయ్య నియామకం

కుల్కచర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ కనకం మొగులయ్య



సమావేశంలో మాట్లాడుతున్న కనకం మొగులయ్య.

కుల్కచర్ల రూరల్, మేజర్ న్యూస్ (జూన్ 11):ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ కొత్త కుర్మ సత్యయ్యను క్యాబ్ వైస్ చైర్మన్ గా నియామకం చేయడం హర్శనీయమని కుల్కచర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ కనకం మొగులయ్య అన్నారు. మంగళవారం ఆయన మీడియా సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. టీజీ క్యాబ్ పాలకవర్గంలో జిల్లాకు ప్రాతినిధ్యం కల్పించడం సంతోషకరమని అందుకు సహకరించిన సీఎం రేవంత్ రెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ తాండురు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుపక్షపాతియని, రైతాంగ అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకుసాగుతుందని పెర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆద్వర్యంలో వికారాబాద్ జిల్లా రాష్ట్రంలోనే నంబర్ 1గా మారబోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరక్టర్ కొండయ్య గౌడ్, మాజీ సర్పంచ్ రవీందర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# పల్లెల్లో అప్పుడే మొదలైన పంచాయతి సందడి

- కులగణన, రిజర్వేషన్ల ఖరారుపై ప్రభుత్వం స్పష్టతివ్వకున్నా.. ముందస్తు ఏర్పాట్లలో ఆశావాహులు
- వివిధ సేవా కార్యక్రమాలతో ఓటర్ల ప్రసన్నానికి యువతరం ముమ్మర ప్రయత్నాలు
- అసెంబ్లీ తీర్మాణం మేరకు కులగణన చేశాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలంటున్న బిసి సంఘాలు
- పెండింగ్ బిల్లులు చెల్లంచాకే స్థానిక ఎన్నికలు జరుపాలంటూ ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించిన తాజా మాజీ సర్పంచ్‌లు
- ఎమ్మెల్యే, ఎంపి ఎన్నికలు ముగిసిన తరుణంలో స్థానిక ఎన్నికలకై ఆశావాహుల ఎదురుచూపులు



ఇర్విన్ గ్రామపంచాయతి కార్యాలయం

మాడ్గుల, మేజర్‌న్యూస్ (జూన్ 11): 2019 గ్రామపంచాయతి ఎన్నికల్లో సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డుసభ్యులుగా పనిచేసినవారిలో అత్యధికులు గ్రామపంచాయతి ఎన్నికలు అనగానే వామ్మో మాకొద్దు ఈ పదవులు, ఊరికి చేసిన ఉపకారం, శవానికి చేసిన సింగారం ఒక్కటే అంటూ జడుసుకుంటున్నారు. సర్పంచ్‌లు, వార్డుసభ్యుల పదవీకాలం ఈయేడాది ఫిబ్రవరిలో ముగిసిపోగా ప్రభుత్వం గ్రామపంచాయతిల పాలన ప్రత్యేక అధికారులకు అప్పగించిన విషయం విధితమే. రాష్ట్రంలో కులగణన జరుపాలని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లిలో తీర్మాణం చేయగా అందుకు అన్ని రాజకీయపార్టీలు మద్దతు పలికాయి. దీంతో ప్రభుత్వం యుద్ధప్రాతిపధికన కులగణన పూర్తి చేయాలన్నా కనీసంగా మూడు నుండి నాలుగు నెలలు పడుతుందని, 2024లో జరుగాల్సిన గ్రామపంచాయతి, ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికలు ఇప్పట్లో లేనట్లేనన్న వాదనలు కూడ వినిపిస్తున్నాయి. అదే విధంగా గతంలో ఉన్న రిజర్వేషన్లతోనే స్థానిక ఎన్నికలు జరిపితే సర్పంచ్ బరిలో నిలిచేందుకు మండలంలోని వివిధ గ్రామాలలో యువతరం సై అంటే సై అంటూ గత రెండు మూడు నెలల నుండే వివిధ సేవా కార్యక్రమాలతో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఈ నేపధ్యంలో సర్పంచ్‌లు, వార్డుసభ్యులుగా గత ఐదేండ్ల పదవీకాలంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ స్థానికంగా తాగునీరు, పారిశుధ్య, విద్యుత్తు వంటి మౌళిక వసతుల కల్పన మొదలుకొని ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు లక్షల రూపాయల సొంత నిధులు వెచ్చించి చేపట్టిన వివిధ గ్రామాభివృద్ధి పనులకు తమ పదవీకాలం ముగిసి నాలుగు నెలలు కావస్తున్నా నేటికి బిల్లులు అంద డం లేదని మండలంలోని చాల గ్రామపంచాయతిల తాజా మాజీ సర్పంచ్‌లు వేదనకు గురవుతున్నారు. అంతేగాకుండ గ్రామాలలో సర్పంచ్‌లుగా, వార్డుసభ్యులుగా ప్రజల మద్ధతుతో గెలిచి వారికి మంచిచేయాలనుకున్నా గత బిఆర్ఎస్ ప్రభుత్వం అమలులోకి తెచ్చిన 2018 నూతన పంచాయతిరాజ్ చట్టంతో అగచాట్లే మిగిలాయి తప్ప అనుకున్నంత అభివృద్ధి చేయలేకపోయినట్లు వారు విచారం వ్యక్తం చేస్తున్నారు. తాము చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల బిల్లులు చెల్లించాకే గ్రామపంచాయతి, స్థానిక ఎన్నికలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఇటీవలే తాజా మాజీ సర్పంచ్‌లతో కలిసి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గూడూరు లక్ష్మినర్సింహ్మారెడ్డి, కార్యవర్గం రాష్ట్ర ఎన్నికల సంఘానికి వినతిపత్రం అందజేసింది. రాష్ట్రంలో ఇప్పటికే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ముగిసి రాష్ట్రంలో, కేంద్రంలో ప్రభుత్వాలు అధికారంలోకి రాగా గ్రామపంచాయతి, స్థానిక సంస్థల ఎన్నికలే తరువాయి. దీంతో ప్రభుత్వం కులగణన, రిజర్వేషన్లపై స్పష్టత ఇవ్వకున్నాగాని గ్రామపంచాయతి, స్థానిక బరిలో నిలువాలనుకుంటున్న ఆశావాహులు మాత్రం ముమ్మరంగా ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటూ ఎన్నికలు ఎప్పుడెప్పుడా అని వేయి కళ్ళతో ఎదురుచూస్తున్నారు.

## పెండింగ్ బిల్లులు చెల్లించాకే పంచాయతి ఎన్నికలు జరుపాలి



**రాజమోని పుష్పలతజంగయ్యయాదవ్ – మాజీ సర్పంచ్, ఇర్విన్**

ఇర్విన్ గ్రామపంచాయతిలో సర్పంచ్‌గా పాలకవర్గసభ్యులతో కలిసి లక్షల రూపాయలు అప్పులు తెచ్చి వివిధ అభివృద్ధి పనులు పూర్తిచేశాము. రైతు వేదిక నిర్మాణంకు సంబంధించి 5లక్షల రూపాయలు, మన ఊరు–మనబడి నిర్మాణాలకు సంబంధించి 5 లక్షలరూపాయలు, గ్రామపంచాయతి పరిధిలోన వార్డుల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలకు సంబంధించి 10లక్షలరూపాయలతో పాటు, వైకుంఠధామానికి సంబంధించి 5లక్షల రూపాయలతో కలిపి మొత్తంగా 25లక్షల రూపాయల నిధులు ప్రభుత్వం ద్వారా తమకు అందాల్సి ఉంది. నెలలు గడుస్తున్నా మేం పూర్తిచేసిన పనులకు బిల్లులు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జి.పిలకు పెండింగ్ బిల్లులు చెల్లించాకే గ్రామపంచాయతి, స్థానిక ఎన్నికలు జరుపాలి.

## మట్టి, సిసి రోడ్లకు సంబంధించి రూ.12.50 లక్షలు రావాల్సివుంది

**జర్పుల హీరాదేవి– మాజీ సర్పంచ్, జర్పులతాండ**



జర్పులతాండ గ్రామపంచాయతి పరిధిలో అప్పటి ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ సహకారంతో సర్పంచ్‌గా తాను, పాలకవర్గం, స్థానికుల సహకారంతో వివిధ అభివృద్ధి పనులు పూర్తిచేశాము. ప్రభుత్వం మంజూరుచేసిన నిధుల తో పాటు మాపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించిన ప్రజల సౌలభ్యం కొరకు మాజీ ఎంపిపి జర్పుల జైపాల్‌నాయక్ లక్షల రూపాయలు సొంత నిధులు వెచ్చించి వివిధ అభివృద్ధి పనులు పూర్తిచేశారు. గ్రామపంచాయతి పాలకవర్గం ఆధ్వర్యంలో తాము చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి 12లక్షల 50వేల రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. జర్పులతాండ వైకుంఠధామం నుండి ఇదే గ్రామపంచాయతి పరిధిలోని దుబ్బతాండ వరకు మట్టిరోడ్డు నిర్మాణానికి సంబంధించి 2లక్షల 50వేల రూపాయలు, జర్పులతాండ జి.పిలోని వివిధ వార్డులలో నిర్మించిన సిసిరోడ్లకు సంబంధించి 10లక్షల రూపాయల బిల్లులు ప్రభుత్వం నుండి అందాల్సివుంది. తమ పదవీకాలంలో ఇట్టి బిల్లులకు చెందిన చెక్కులను ఎస్టీఓలో జమచేసినప్పటికి అవి తిరస్కరణకు గురయ్యాయి. మండలంలోని చాల గ్రామాలలో సర్పంచ్‌లుగా పనిచేసినవారు అభివృద్ధి పనులకు చెందిన బిల్లులు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తమకు పెండింగ్ బిల్లులు విడుదల చేశాకే లోకల్‌బాడీ ఎన్నికలు నిర్వహించాలి.

# జంట హత్యల కుటుంబాలను పరామర్శించిన ఎంపి, ఎమ్మెల్యే

**– బాధిత కుటుంబాలకు రూ.20వేల ఆర్థిక సహాయం అందజేత**



కడ్తాల్, మేజర్‌న్యూస్ ( జూన్ 11): కడ్తాల్ మండల కేంద్రం సమీపంలోని బటర్ ఫ్లైసిటీ వెంచర్‌లో గల ఓ విల్లాలో ఇటీవల హత్యకు గురైన గోవిందాయపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు యువకుల కుటుంబాలను మంగళవారం నాగర్‌కర్నూల్ ఎం.పి డాక్టర్ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలు పరామర్శించారు. ఈ మేరకు గోవిందాయపల్లి గ్రామానికి చెందిన శేషుగారి శివ, గుండెమోని శివల కుటుంబీకుల వారు ఓదార్చారు. హత్యలకు పాల్పడిన నిందితులకు చట్ట ప్రకారం సరైన శిక్ష పడుతుందని భరోసాకల్పించారు. అనంతరం ఒక్కో కుటుంబానికి 10వేల రూపాయల చొప్పున హత్యకు గురైన రెండు కుటుంబాలకు మొత్తం 20వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. అదేవిధంగా ప్రభుత్వ పరంగా బాధిత కుటుంబాలకు న్యాయం చేసేలా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఇదే గ్రామానికి చెంది ఆత్మహత్య చేసుకున్న మహిళ కుటుంబ సభ్యులను వారు పరామర్శించి 5వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఎంపి, ఎమ్మెల్యేల వెంట టిపిసిసి సభ్యులు ఆయిల్ల శ్రీనివాస్ గౌడ్, డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ్మముదిరాజ్, కాంగ్రెస్ నాయకులు బీక్యా నాయక్, బీచ్యానాయక్, భాస్కర్ రెడ్డి, వెంకటేష్,, జహంగీర్ అలీ, వేణుగోపాల్, బాల్‌రాజ్, శ్రీనివాస్, రాజేష్, శబ్బు తదితరులున్నారు.

# మైసిగండి ఆలయహుండికి రూ. 15,17,494ల ఆదాయం



కడ్తాల్, మేజర్‌న్యూస్ (జూన్ 11): కడ్తాల్ మండలం మైసిగండి మైసమ్మ దేవాలయ హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఆలయ ఫౌండర్‌ట్రస్టీ రామావత్ లక్ష్మిసిరోళి, కార్యనిర్వాహణాధికారిణి ఆర్.స్నేహలతల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి దేవాదాయ ధర్మాదాయశాఖ రంగారెడ్డి జిల్లా సహాయకమీషనర్ టి. శేఖర్ హాజరై హుండీ లెక్కింపును పర్యవేక్షించారు. ఈసందర్భంగా అమ్మవారి ఆలయ హుండికి భక్తుల నుండి గడిచిన 75రోజులకు గాను పదిహేను లక్షల పదిహేడు వేల నాలుగు వందల తొంబై నాలుగు రూపాయల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఫౌండర్ ట్రస్టీ, కార్యనిర్వాహణాధికారిణిలు తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో ఆలయ నిర్వాహకులు, అర్చక ఉద్యోగులు ఆర్.పి భాస్కర్, అరుణ్, మాధారం యాదగిరిగౌడ్, చంద్రయ్య, బోడియానాయక్, క్రిష్ణ, రాములు, దేవేందర్, రమాదేవి, శ్రీనివాసులు, పత్య నాయక్, కృష్ణయ్య, చారి, శ్రీను, హర్షవర్ధన్ ఆలయ, కెనరా బ్యాంకు సిబ్బంది లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# నాలాలు శుభ్రం చేస్తున్న పనులను పరిశీలించిన మేయర్



బాలాపూర్ మేజర్ న్యూస్ ( జూన్ 11): వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని మంగళవారం నాదర్గుల్, కమ్మగూడ లో నాలాలు శుభ్రం చేస్తున్న పనులను పరిశీలించిన కార్పొరేషన్ మేయర్ పారిజాత రెడ్డి. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్లో నాదర్గుల్, కమ్మగూడ లో రానున్న వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని నాలాలు శుభ్రం చేస్తున్న పనులను డిప్యూటీ మేయర్ కమిషనర్ లతో కలిసి మేయర్ చిగురింత పారిజాత నరసింహారెడ్డి మంగళవారం పరిశీలించారు. అనంతరం అల్మాస్ గూడలోని పాఠశాలలో జరుగుతున్న మరమత్తు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రమ్ శేఖర్, కమిషనర్ జి.రఘు, డీఈఈ జ్యోతి రెడ్డి, కార్పొరేటర్ జెనిగే పద్మ ఐలయ్య, ఏఈఈ వినీల్ గౌడ్, శానిటేషన్ ఇన్సిపెక్టర్ యాదగిరి, కాలనీవాసులు పాల్గొన్నారు.

# బక్రీద్ సందర్భంగా జిల్లాలో 10 చెక్ పోస్ట్‌లు ఏర్పాటు

● ఏవరైనా పశువులను అక్రమ రవాణా చేస్తే పోలీసులకు సమాచారం అందించాలి ● జిల్లాఎస్పీ నంద్యాల కోటి రెడ్డి



వికారాబాద్ జిల్లా ప్రతినిధి,మేజర్‌న్యూస్(జూన్11):బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా మరియు జంతువుల అక్రమ రవాణా ను అరికట్టుట కొరకు జిల్లాలో 10 చెక్ పోస్ట్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...బక్రీద్ పండుగ సందర్భంగా గోవులు,లేగదూడల అక్రమ రవాణాను చేయవద్దని,జిల్లాలో శాంతిభద్రతలు, జంతు అక్రమ రవాణాను అరికట్టుటకు జిల్లాలో వికారాబాద్ పోలీస్ స్టేషన్, ధారూరు పోలీస్ స్టేషన్, మొమిన్‌పేట్ పోలీస్ స్టేషన్,చన్గోముల్ పోలీస్ స్టేషన్, పరిగి పోలీస్ స్టేషన్ , తాండూర్ పోలీస్ స్టేషన్ మరియు యాలాల పోలీస్ స్టేషన్ ల పరిధిలలో మొత్తం 7 అంతర్ జిల్లా చెక్ పోస్ట్ లు మరియు బషీరాబాద్ పోలీస్ స్టేషన్, కరణ్ కోట్ పోలీస్ స్టేషన్ మరియు కొడంగల్ పోలీస్ పరిధిలలో 3 అంతర్ రాష్ట్ర చెక్ పోస్ట్ లు మొత్తం జిల్లాలో 10 చెక్ పోస్ట్‌లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పశువుల వ్యాపారులు పశువుల క్రయ,విక్రయాలలో భాగంగా ఖచ్చితంగా గ్రామ పంచాయితీ లేదా మున్సిపాలిటి అధికారుల చేత ధృవీకరించిన రశీదులను ఖచ్చితంగా కలిగి ఉండాలన్నారు. పశువుల రవాణా సమయంలో కచ్చితంగా నియమ నిబంధనలు పాటించాలని, ఎవరైనా పశువులను అక్రమంగా రవాణా చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని ఆయన హెచ్చరించారు.ఏవరైనా పశువులను అక్రమరవాణా చేస్తున్నట్టు సమాచారం తెలిస్తే పోలీస్ అధికారులకు గాని డైల్ 100 కి గాని సమాచారం అందించాలని, అలా కాకుండా వారిపై భౌతికంగా ధాడులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# మున్సిపల్ పరిధిలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలి

● రాత్రి వేళ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ● మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భీమిడి జైపాల్ రెడ్డి ● మున్సిపల్ కమీషనర్‌కు వినతిపత్రం అందజేత



షామిర్ పేట,మేజర్ న్యూస్(జూన్,11):తూముకుంట మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో వీధి దీపాలు(స్ట్రీట్ లైట్స్) ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు తీర్చగలరని మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భీమిడి జైపాల్ రెడ్డి కమిషనర్ ను కోరారు.మంగళవారం వీధి దీపాల విషయంలో వివిధ కాలనీల వాసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా భీమిడి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ... తూంకుంట మున్సిపల్ పరిధిలో పలు ప్రాంతాలలో వీధి దీపాలు (స్ట్రీట్ లైట్స్) లేక రాత్రి సమయాలలో ప్రజలకు,అదేవిధంగా ఉద్యోగాలకు వెళ్లే వారికి కూడా చాలా ఇబ్బంది కలుగుతుంది,తరచూ ప్రమాదాలు, దొంగతనాలు జరుగుతున్నాయి,వాటిని ఆరి కట్టడానికి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయడం కోసం పలు ప్రాంతాలలో అవసరం ఉన్న దగ్గర విద్యుత్ స్తంభాలు, మరియు వీధి దీపాలు (స్ట్రీట్ లైట్స్) ఏర్పాటు చేయవలసిందిగా కమిషనర్ ను కోరడం జరిగిందని అన్నారు. ఈ క్రింద చూపబడిన ప్రాంతాల్లో వీధి దీపాల అవసరం గూర్చి వినతిపత్రం లో పేర్కొన్నారు. అవి తూంకుంట నుండి పోతాయిపల్లి,ఎలీగలగుడ, దేవరయాంజా ల్ మీదిగా కోంపల్లి బ్రిడ్జి వరకు,రాజీవ్ రహదారి హకీంపేట్ హనుమాన్ ఆలయం నుండి స్పోర్ట్స్ స్కూల్ వరకు,రాజీవ్ రహదారి నుండి దేవరయాంజాల్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు,దేవరయాంజాల్ చత్రపతి శివాజీ విగ్రహం నుండి జేన్వి కన్వెన్షన్ వరకు,డియంసి ఎక్స్ రోడ్ నుండి అర్కలగూడ వరకు,డియంసి నుండి ప్రకృతి వెన్యూ వరకు,దేవరయాంజాల్ తాళ్ల మైసమ్మ నుండి నిమ్మల గార్డెన్ వరకు,తూంకుంట బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం నుండి మందాయిపల్లి వరకు,దేవరయాంజాల్ పీసరి శ్రీనివాస్ రెడ్డి వ్యవసాయం భూమి దగ్గర నుండి మందాయిపల్లి వరకు,తూంకుంట చెరువు కట్ట రేణుక ఎల్లమ్మ ఆలయంనుండి బిట్స్ పిలానీ వరకు, పోతాయిపల్లి స్మశాన వాటిక నుండి మందాయి పల్లి రోడ్ గ్రనడా విల్లా వరకు,దేవరయాంజాల్ వలందాస్ మురళి గౌడ్ ఇంటి నుండి రాధిక గార్డెన్ వరకు,దేవరయాంజాల్ తుర్కవానికుంట నుండి యస్‌విఆర్ పంక్షన్ హల్ వరకు,హాకీంపేట్ గాంధీ విగ్రహం నుండి సింగాయిపల్లి చాకలి ఐలమ్మ విగ్రహం వరకు ఏర్పాటు చేయాలని వినతిపత్రం లో కోరారు.మున్సిపల్ కమిషనర్ ను కలిసిన వారిలో..

మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ 4 వ వార్డు కౌన్సిలర్ మధుసుదన్ రెడ్డి,మున్సిపల్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మురళి గౌడ్,మెహన్ రెడ్డి,మున్సిపల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్,మున్సిపల్ కాంగ్రెస్ కార్యదర్శి మురళి గౌడ్,మున్సిపల్ కాంగ్రెస్ అనుబంధ సంఘాలు ఓబీసీ సెల్,యస్సీ సెల్,కిసాన్ సెల్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు లక్ష్మినారాయణ, హరిగోపాల్,ధర్మారెడ్డి,జగదీష్ గౌడ్,మాజీ ఉప సర్పంచ్ రాజు,మున్సిపల్ కాంగ్రెస్ ఓబీసీ ప్రధాన కార్యదర్శి దర్శన్ గౌడ్,మున్సిపల్ కాంగ్రెస్ యస్సీ సెల్ ఉపాధ్యక్షులు దుర్గయ్య,వార్డుల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జగన్,బల్వంత్ రెడ్డి,మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు వేణుగోపాల్ రెడ్డి,శ్రీధర్ రెడ్డి,శ్రీనివాస్,మల్లేష్ గౌడ్,మున్సిపల్ యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ మధు రెడ్డి,పలు కాలనీల నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమణకు గురైన పార్కు స్థలాల పరిరక్షణకు చర్యలు

– పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి



మొక్కలు నాటి నీళ్ళు పోస్తున్న దృశ్యం.

ఘట్‌కేసర్ రూరల్, మేజర్‌న్యూస్(జూన్ 11) :

పోచారం మున్సిపాలిటీ యంనంపేట్ పరిధిలోని శ్రీ వెంకటేశ్వర హౌసింగ్ కాలనీలోని అన్యాక్రాంతమై తున్న పార్కు స్థలాన్ని మున్సిపాలిటీ అధికారులు స్వాదీనం చేసుకొని ఎట్టకేలకు మంగళవారం చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, కమిషనర్ వేమన్ రెడ్డి, కౌన్సిల్ సభ్యులు పాల్గొని మొక్కలు నాటారు. ఈ మేరకు చైర్మన్ కొండల్ రెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని అన్యాక్రాంతమైన పార్కు స్థలాలను దశలవారిగా స్వాధీనం చేసుకొని వాటి రక్షణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మున్సిపాలిటీ పార్కు స్థలాల జోలికి వస్తే ఎంతటి వారైన ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నానావత్ రెడ్యా నాయక్, కౌన్సిలర్లు చింతల రాజశేఖర్, సుర్వి రవీందర్ గౌడ్, కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ అక్రం అలీ, పోచారం మాజీ ఉపసర్పంచ్ ఆకిటి బాల్‌రెడ్డి, నాయకులు సామల బుచ్చిరెడ్డి, నర్రి కాశయ్య, బద్దం జగన్ మోహన్ రెడ్డి, అబ్బవతి నర్సింహా, సుర్వి శ్రీనివాస్ గౌడ్, శేఖర్, మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సకాలంలో విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేయాలి: డిఆర్డిఓ శ్రీనివాస్



కుట్టు మిషన్ కేంద్రాలను పరిశీలిస్తున్న డిఆర్డిఓ.

కుల్కచర్ల రూరల్, మేజర్ న్యూస్ (జూన్ 11):ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సకాలంలో ఏకరూప దిస్తులు పంపిణీ చేయాలని డిఆర్డిఓ శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని మహిళ శక్తి కుట్టు కేంద్రానికి తనిఖీ చేశారు. టి సందర్భంగా ఆయన టైలర్ లతో మాట్లాడుతూ... యూనిఫార్మ్ కొడుతున్నారా లేదా అనే విషయాన్ని టైలర్ లను అడిగి తెలుసుకున్నారు. యూనిఫామ్స్ కుట్టేటప్పుడు ఎలాంటి తేడాలు రాకుండా చెప్పినటువంటి విధానంతో కుట్టాలని సూచించడం జరిగింది. అనంతరం కుట్టిన దుస్తులను ఏ విధంగా ప్యాకింగ్ చేస్తున్నారని మహిళలని అడిగి తెలుసుకున్నారు. కుల్కచర్ల మండలంలో సీసీ క్లస్టర్ వారిగా9 మహిళా శక్తి కుట్టు కేంద్రాలను ఏర్పాటు చేసి ఇట్టి యూనిఫార్మ్ కుట్టించడం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం శ్రీ శక్తి భవనంలో ఉపాధి హామీ పనులకు సంబంధించి సిబ్బందితో సమీక్షించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిపీఎం రామ్మూర్తి,ఎంపీడీవో రామకృష్ణ నాయక్, ఏపీఎం శోభ, ఉపాధి హామీ సిబ్బంది, సీసీ లు, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందించండి

● ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపిన ఏఐటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జానకి రాం చౌహన్



కుల్కచర్ల,మేజర్‌న్యూస్(జూన్11): కేంద్రంలో ఎన్డీఏ కూటమి పాలన లో అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందేలా చూడాలని ఏఐటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జానకి రాం చౌహన్ తెలిపారు. చేవెళ్ల పార్లమెంటు ఎన్నికల్లో ఘనవిజ యం సాధించిన కొండా విశ్వేశ్వర్ రెడ్డిని ఆయన మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్రంలో కొలువుదీరిన ఎన్డీఏ గవర్నమెంట్‌లో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేయాలని ఆయన ఎంపీని కోరారు.ముఖ్యంగా రానున్న రోజుల్లో తెలంగాణలో బిజెపి పార్టీ స్థానిక సంస్థలలో విజయం సాధించేల కార్యచరణ రూపొందించాలని ఆయన ఎంపీని కోరారు. అనంతరం ఆయన శాలువా పూల బొకేతో ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డిని సన్మానం చేశారు.

# బ్యూటీ పార్లర్ కోర్సుకు దరఖా చేసుకోవాలి

లీడ్ బ్యాంకు మేనేజర్ రాంబాబు



వికారాబాద్ జిల్లా ప్రతినిధి,మేజర్ న్యూస్(జూన్11) : బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్ కోర్సు ఉచిత శిక్షణకు ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని లీడ్ బ్యాంకు మేనేజర్ రాంబాబు మంగళవారం ఒక ప్రకటన తెలిపారు. జూన్ 13వ తేదీలోగా స్వర్ణ భారతి ట్రస్ట్, ముచ్చింతల్, రంగారెడ్డి జిల్లాలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కోర్సును స్వర్ణ భారత్ ట్రస్ట్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జిఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ వారి సహకారంతో నిర్వహించబడుతుందన్నారు. కోర్సు 30 రోజులపాటు ఉదయం 9:30 నుండి 5:30 వరకు శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి సదుపాయం కల్పించబడుతుందన్నారు. శిక్షణ పొందే అభ్యర్థులు 19 సంవత్సరాల నుండి 45 సంవత్సరాల లోపు కలిగి ఉండాలని ఆయన అన్నారు. రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల వాస్తవ్యులు ఆధార్ కార్డు, రేషన్ కార్డ్, మూడు ఫోటోలతో సహా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు చదవడం, రాయడం తప్పనిసరిగా వచ్చి ఉండాలని ఆయన తెలిపారు. ఇతర సమాచార నిమిత్తం 9391487797, 9177141712,9618534720 , 6301890681 ల సంప్రదించవచ్చని ఆయన ప్రకటనలో తెలిపారు.

# మ్యాజిక్ బస్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం



మ్యాజిక్ బస్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం.

కుల్కచర్ల రూరల్, మేజర్‌న్యూస్ (జూన్ 11):కుల్కచర్ల మండల పరిధిలోని రాంరెడ్డిపల్లి గ్రామంలో మ్యాజిక్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు గ్రామంలో తిరుగుతూ బడి బయట ఉన్న పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అనేక రకాల మౌలిక సదుపాయాలు ప్రభుత్వం సమకూర్చుడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు, పంచాయతీ కార్యదర్శి సంతోష్, ఉపాధ్యాయులు వెంకటేష్, వెంకటేశ్వర్లు, మ్యాజిక్‌బస్ సిబ్బంధి ఏఈ అరవింద్, ఎల్ఎస్ఈ రఘు, నరేందర్, కిరణ్, వేణుగోపాల్, సద్గుణ, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

- సీఎం నియోజకవర్గంలో పనిచేసే అధికారులు పూర్తి బాధ్యతతో పనిచేయాలి
- కడ సమావేశంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి



కడా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణ రెడ్డి.

వికారాబాద్ జిల్లా ప్రతినిధి,మేజర్‌న్యూస్(జూన్11): కొడంగల్ నియోజకవర్గం లో కడ క్రింద చేపట్టాల్సిన పనులను గుర్తించి పురోగతి దిశగా వెళ్లాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధిపై శాఖల వారీగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొడంగల్ మెడికల్ కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి పనులు మొదలు పెట్టాలని, ఆసుపత్రికి వాటర్ ప్లాంట్, రెండు అంబులెన్సులు, జనరేటర్ తో పాటు అవసరమైన సిబ్బంది కొరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. రోడ్లు, భవనాల శాఖ, పంచాయత్ రాజ్ ఇంజనీరింగ్ శాఖల ద్వారా అవసరమైన సింగిల్, డబుల్ రోడ్లతోపాటు జిపి బిల్డింగ్స్, కమ్యూనిటీ హాల్స్, వంతెనలు అతిథి గృహం కొరకు గుర్తించిన పనులను మొదలు పెట్టాలని సూచించారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలు, కళాశాలల భవనాల నిర్మాణ పనులు ప్రారంభించాలని, విద్యుత్ శాఖ ద్వారా వ్యవసాయం, డొమెస్టిక్ అవసరాల మేరకు అవసరం మేరకు కొత్త ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఇరిగేషన్ శాఖ ద్వారా కొడంగల్ నియోజకవర్గానికి అవసరమైన సాగు, తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. పశుసంవర్ధక శాఖను బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టాలని, అలాగే వ్యవసాయ శాఖకు సంబంధించిన డిప్లమా కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొడంగల్ నియోజకవర్గంలో జిల్లా స్థాయి తరహాలో అభివృద్ధి పరిచేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ముఖ్యమంత్రి నియోజకవర్గం లో పనిచేసే అధికారులందరూ పూర్తి బాధ్యతతో పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ , కడ స్పెషల్ ఆఫీసర్ వెంకట్ రెడ్డి, అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్, తాండూర్ ఆర్డిఓ శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు.

# కారు బీభత్సం సృష్టించిన 14 ఏళ్ల బాలుడు



మణికొండ, మేజర్ న్యూస్ (జూన్ 11)ః ఇంట్లో తల్లిదండ్రులకు తెలియకుండా ఓ బాలుడు కారుతో వీరంగం సృష్టించాడు. వివరాల్లోకి వెళితే మణికొండ మున్సిపల్‌లోని నెక్నాంపూర్‌కి చెందిన 14 ఏళ్ల అబ్బాయి ఇంట్లో తల్లిదండ్రులకు తెలియకుండా కార్ డ్రైవింగ్ చేస్తూ గోల్డెన్ టెంపుల్ సమీపంలోకి రాగానే అదుపు తప్పి రెండు టూ వీలర్ కి తగిలించడంతో అక్కడే ఉన్న స్థానికులు పెద్దగా అరవడంతో మరింత కంగారుపడి కారు స్పీడు పెంచగా ఎట్టకేలకు స్థానికులు పట్టుకొని నార్సింగ్ పోలీసులకు అప్పగించడంతో కార్ ఓనర్‌పై 337.279 సెక్షన్ క్రింద కేసు నమోదు చే శారు పోలీసులు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైనర్లకు వెయికిల్స్ ఇస్తే తల్లిదండ్రులకు కచ్చితంగా కేసులు నమోదు చేస్తామని అన్నారు.

# బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి

## ఏసీపీ లక్ష్మీకాంత్ రెడ్డి



జల్ పల్లి, మేజర్ న్యూస్ (జూన్ 11):బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా జరుపుకోవాలని అన్నారు మహేశ్వరం ఎసిపి లక్ష్మీకాంత్ రెడ్డి. బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం శాంతి సమావేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహేశ్వరం జోన్ ఎసిపి లక్ష్మీకాంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. బక్రీద్ పండగ సందర్భంగా ముస్లిం సోదరులు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. గొర్రెలను పశువులను రహదారులకు దూరంగా విక్రయించాలన్నారు. ముస్లిం సోదరులు పండుగ రోజు కుర్బానీ ఇచ్చిన అనంతరం వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకూడదన్నారు. మున్సిపల్ సిబ్బంది అందించే కవర్లలో చెత్తను వేసి,చెత్త సేకరించే వాహనాలలో వేయాలన్నారు. పండుగ వాతావరణంలో ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోకుండా బక్రీద్ పండుగను జరుపుకోవాలని సూచించారు. బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాలనీ,బస్తీలలో ఎప్పటికప్పుడు సీసీ కెమెరాలతో పోలీసుల నిఘా ఉంటుందన్నారు. శాంతిభద్రతలకు ఎలాంటి ఇబ్బంది కలిగించిన,వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బాలాపూర్ ఇన్స్పెక్టర్ భూపతి, ఎస్సైలు మహేందర్, జానీ, సైదులు, మున్సిపల్ అధికారి వై సుదర్శన్, పీస్ కమిటీ సభ్యులు,ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములు అక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం...

- కొందరు రెచ్చ గొట్టే చర్యలకు పాల్పడుతున్నారు
- సర్వే నెంబర్ 111లో ప్రభుత్వ భూమి ఉంది
- ఆర్డీవో శ్రీనివాస్ రావు వెల్లడి



ప్రభుత్వ భూమి అని బోర్డు ఏర్పాటు చేస్తున్న దృశ్యం.

తాండూరు,మేజర్‌న్యూస్(జూన్ 11)ః తాండూరు టౌన్ లోని విజయ విద్యాలయ హైస్కూల్ పక్కన సర్వే నెంబర్ 111లో ప్రభుత్వ భూమి ఉన్నదని ఇందులో కొంత భూమిని కొందరు ఆక్రమించి బోర్డు పెట్టుకోగా దానిని తొలగించి ప్రభుత్వ భూమి ఉందని బోర్డు ఏర్పాటు చేయడం జరిగిందని తాండూరు ఆర్డీవో శ్రీనివాస్ రావు పేర్కొన్నారు. ఇందులో కొందరు జోక్యం చేసుకుని ఎదొదో ప్రచారం చేస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని మంగళవారం నాడు ఆర్డీవో శ్రీనివాస్ రావు పేర్కొన్నారు.

ఇప్పటికే సర్వే చేపట్టి ఆ భూమి ప్రభుత్వ భూమని ప్రభుత్వానికి నివేదిక పంపడం జరిగిందని అన్నారు. కబ్జాదారులు పతుకున్న బోర్డును తొలగించి ప్రభుత్వ భూమని బోర్డు ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన చెప్పారు. ఇట్టి సర్వే నెంబర్‌లో మొత్తం 14ఎకరాల 14గుంటల భూమి ఉన్నదని ఇందులో ఆర్డీవో కార్యాలయం కొంత బాగం, అర్ అండ్ బి రోడ్డు, విజయ విద్యాలయ హైస్కూల్, అక్రమనికి గురైన భూమి ఉన్నదని ఆయన అన్నారు. (1954-55) ఖాస్ర పహని నుండి ప్రస్తుత రెవెన్యూ రికార్డుల వరకు ఇట్టి సర్వే నెంబర్ భూమి రికార్డులలో ప్రభుత్వ భూమి గానే ఉన్నదని ఆయన చెప్పారు. ఇట్టి భూమి పై కోర్టులో స్టే ఉన్నదని ఎవరైనా కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

# యువతి అదృశ్యం



జల్ పల్లి, మేజర్ న్యూస్ (జూన్ 11):యువతి అదృశ్యమైన సంఘటన పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం. బాలాపూర్ మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన చీర్ల జయమ్మకు ఇద్దరు కుమార్తెలు,ఒక కుమారుడు ఉన్నారు. ఆమె పెద్ద కుమార్తె భవాని వయస్సు 22 సంవత్సరాలు. జిఎంఆర్ ఏరో టవర్స్ ఆర్ జిఐ ఎయిర్‌పోర్టులో రిసెప్షనిస్ట్ గా పని చేస్తుంది.

ఈనెల 10న సుమారు 9:30 గంటలకు ఆమె కుమార్తె భవాని డ్యూటీకి వెళ్ళింది. అదే రోజు 12 గంటలకు తన కూతురు మొబైల్ నెంబర్ కి సంప్రదించగా అది నెట్వర్క్ కవరేజ్ లేదని వచ్చింది. ఆ తర్వాత ఆమె ఆఫీసుకు ఫోన్ చేయగా ఆమె ఆఫీసుకు రాలేదని చెప్పారు. దీంతో భవాని గురించి కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాలలో బంధువుల వద్ద వెతికిన ఫలించలేదు. అయితే తన ఇంటి యజమాని కుమారుడు పసుపుల రాజేష్ 23 సంవత్సరాలు. అనే వ్యక్తి తన కుమార్తెను తీసుకెళ్లి ఉండవచ్చని అనుమానిస్తూ పహాడీ షరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# రేపు వికారాబాద్‌లో జాబ్ మేళా

## జిల్లా ఉపాధి కల్పనా శాఖ అధికారి షేక్ అబ్దుల్ సుభాన్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి,మేజర్‌న్యూస్(జూన్11) : ఎస్బిఐ కార్డుల నందు ఉద్యోగ నిమిత్తం దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా జిల్లా ఉపాధి కల్పనా అధికారి షేక్ అబ్దుల్ సుభాన్ మంగళవారం ఒక ప్రకటన తెలిపారు. వికారాబాదు జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్ కాలనీలోని ఐటిఐ క్యాంపస్‌లో గల జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాల యంలో ఈ నెల 13వ తేదీన ఉదయము 10: 30 గంట లకు జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎస్బిఐ కార్డ్స్ (థర్డ్ పార్టీ రోల్)లో సుమారు 50 ఉద్యోగాలు ఉన్నట్లు తెలిపారు. ఈ ఉద్యోగాలకు సంబంధించి ఏదేని గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుండి డిగ్రీ అర్హత కలిగి ఉండాలన్నారు. నిరుద్యోగ అభ్యర్థులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు జాబ్ మేళా నిర్వాహకుడు మియా సాబ్ కు ఫోన్ నంబర్ 9676047444 కు సంప్రదించాలని ఆయన తెలిపారు.

# నేటి నుండి ప్రభుత్వ పాఠశాలలు షురూ



తాండూరు రూరల్, మేజర్ న్యూస్ (జూన్ 11)ః తాండూరు మండల పరిధిలోని ఆయా గ్రామంలో మంగళ వారం వారం పాఠశాల పునర్ ప్రారం భం సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయు లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసిన ఎంఈఓ వెంకటయ్య గౌడ్ ఉపాధ్యాయులంతా బడిబాట కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నాడు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేయాలని తెలిపారు. వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకొని పరిశుభ్రత పాటించాలని సూచించారు. పరిశుభ్రమైన తాగునీటిని విద్యార్థులకు అందించాలని ఏకరూప దుస్తులను పంపిణీ, పాఠ్యపుస్తకాలు పంపిణీ ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అందించాలని పేర్కొన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు సమయపాలన పాటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాగప్ప, పురుషోత్తంరెడ్డి, నర్సిరెడ్డి శ్రీనివాస్, మృత్యుంజయులు, శివకుమార్, కిష్టప్ప, జైపాల్ రెడ్డి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి విద్యాశాఖ మంత్రి పదవి కేటాయించాలి



ఆమనగల్లు, మేజర్ న్యూస్ (జూన్ 11) రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థలను ఏర్పాటు చేసి ఎందరో పేద విద్యార్థులకు ఉచిత చదువులు అందించిన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కి మంత్రివర్గ విస్తరణలో విద్యాశాఖ మంత్రి పదవికేటాయించాలని రాష్ట్ర శాలివాహన సంఘం నాయకులు, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎగిరిశెట్టి సత్యం కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థ పై సంపూర్ణ అవగాహన ఉన్న ఆయనకు విద్యాశాఖ మంత్రి కేటాయించడంతో రాష్ట్రంలో విద్యాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థలను ఏర్పాటు చేసి ఎందరో పేద విద్యార్థులకు విద్యను అందించారని, అదేవిధంగా విద్యా కుసుమం సీత ప్రనూష ఇటీవల ప్రకటించిన నీట్ ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిందని ఇది ఆయన విద్యాసంస్థల కృషి ఫలితమేనని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించేందుకు ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కి విద్యా శాఖ కేటాయించి విద్యాభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ అధిష్టానానికి ఆయన విజ్ఞప్తి చేశారు .

## పెండింగ్ బిల్లులు చెల్లించాలని తాజా మాజీ సర్పంచ్‌ల వినతి



ఆమనగల్లు, మేజర్ న్యూస్ (జూన్ 11) గ్రామాల అభివృద్ధి కోసం చేపట్టిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని మంగళవారం ఎంపీవో శ్రీలత కు ఆమనగల్లు మండల తాజా మాజీసర్పంచ్ లువిజ్ఞప్తి చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తమ పదవీకాలంలో గ్రామాల అభివృద్ధి కోసం అప్పులు చేసి అభివృద్ధి పనులు చేపట్టామని పదవీకాలం ముగిసిన బిల్లును చెల్లించకపోవడంతో తాము, తమ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు చెప్పారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభించే లోగా పెండింగ్ బిల్లులు చెల్లించి ఆదుకోవాలని లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని వారు హెచ్చరించారు.

## ఫిక్కీ నుంచి స్మార్ట్ అర్బన్ ఇన్నోవేషన్ అవార్డును అందుకున్న రామ్‌కీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్

హైదరాబాద్, మేజర్‌న్యూస్(జూన్ 11) : ప్రతిష్ఠాత్మక ఫిక్కీ (ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చా ంబర్స్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ) యొక్క స్మార్ట్ అర్బన్ ఇన్నోవేషన్ అవార్డు 2024 లలో సస్టెయినబుల్సిటీస్ విభాగంలో రామ్‌కీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (రామ్‌కీ)కి అవార్డు లభించింది. ఈగుర్తింపు తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని జవహర్‌నగర్‌లో ఉన్న లెగసీలీచేట్ శుద్ధి, నాశనం చేయటంలో వారి గణనీయమైన తోడ్పాటును గుర్తించి, గౌరవిస్తుంది.

5వ ఎడిషన్ స్మార్ట్ అర్బన్ ఇన్నోవేషన్ అవార్డ్స్ సందర్భంగా ఈ అవార్డును అందించారు, ఇది ఫిక్కీ యొక్క సిటీ స్సమ్మిట్ 7వ ఎడిషన్‌తో పాటు క్లిష్టమైన పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి సమస్యల కోసం చర్చలు, వినూత్న పరిష్కారాలను ప్రోత్సహించడానికి నిర్వహించబడింది. కార్పొరేట్లు, ప్రభుత్వ సంస్థలు, విద్యా సంస్థలతో సహా పలు సంస్థల నుంచి దేశంలోని స్మార్ట్ సిటీల మిషన్ కోసం పని చేస్తున్న రికార్డు స్థాయి 98 ఎంట్రీల నుండి గుర్తింపు పొందిన 10 సంస్థలలో రామ్‌కీ కూడా ఒకటి.

వ్యర్థాలు కుళ్ళిపోవడం వల్లవచ్చే విషపూరితమైన ఉప ఉత్పత్తి, లెగసీలీచేట్. సమీపంలోని నీటి వనరులతో పాటు భూగర్భ జలాలను కలుషితం చేయడం ద్వారా తీవ్రమైన పర్యావరణ ముప్పును ఇది కలిగిస్తుంది. రామ్‌కీ యొక్క వినూత్న పరిష్కారం ఈసమస్యను పరిష్కరించడానికి రూపొందించిన 2,000 లీచే ట్రీట్‌మెంట్ ప్లాంట్ కలిగి ఉంది. ఈప్రాజెక్టులో వ్యర్థ పదార్థాల నిర్వహణ సదుపాయానికి సమీపంలో ఉన్నచెరువుల పునరుద్ధరణ, స్థిరీకరణ కూడా ఉంది. ముఖ్యంగా హైదరాబాద్‌లో లెగసీలీచేట్ యొక్క ప్రాథమిక అంచనా పరిమాణం 849,780.88 కిలోలీటర్లు కంటే ఎక్కువగా ఉండటంతో ప్రాజెక్ట్ ఒక ముఖ్యమైన సవాలును ఎదుర్కొంది.

సస్టైనబుల్సిటీస్ విభాగం కింద స్మార్ట్ అర్బన్ ఇన్నోవేషన్ అవార్డు 2024 అందుకోవడం మేము గౌరవంగా భావిస్తున్నామని రామ్‌కీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వై.ఆర్. నాగరాజ అన్నారు ఈ గుర్తింపు మన నగరాలకు స్థిరమైన భవిష్యత్తుకు మార్గం సుగమం చేసే నగర పరిష్కారాలను అందించడంలో రామ్‌కీ యొక్క తిరుగులేని నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. దేశంలోనే తొలిసారిగా హైదరాబాద్ లీచెట్‌ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఈ నిబద్ధతకు నిదర్శనంగా నిలవటంతో పాటుగా భవిష్యత్ ప్రాజెక్టులకు సంబంధించి పరిశ్రమ బెంచ్ మార్క్‌ను ఏర్పాటు చేసింది. ప్రస్తుత, భవిష్యత్తు తరాలకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన రేపటికి దోహదపడే మౌలిక సదుపాయాల పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి, అందించడానికి మేము అంకితభావంతో ఉన్నాము అని జోడించారు.

## మీర్‌పేట్ పరిధిలో డ్రగ్స్ గంజాయి అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలి



బాలాపూర్ మేజర్ న్యూస్( జూన్ 11): మీర్పేట్ బాలాపూర్ పరిధిలో గంజాయి డ్రగ్స్ అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాలాపూర్ పి వై ఎల్ కమిటీ సభ్యులు కలిసి మీర్పేట్ సీఐ కాశీ విశ్వనాథకు వినతి. మీర్పేట్ బాలాపూర్ పరిధిలోని డ్రగ్స్ గంజాయి అమ్మే వారిపై చర్యలు తీసుకోవాలని మీర్పేట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆయా ప్రాంతాలలో పిల్లలను యువకులను వ్యసనపరులుగా మారుస్తున్న మాదకద్రవ్యాలను నియంత్రించాలని పేర్కొన్నారు. ప్రగతిశీల యువజన సంఘం బాలాపూర్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సీఐ కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఇటీవల కాలంలో యువకులకు మహమ్మారి వలె పట్టి పీడిస్తూ వారిని పిలిచి పిప్పి చేసే మాదకద్రవ్యాలు తయారయ్యాయని అన్నారు. మీర్పేట్ పరిధిలో గంజాయి లాంటి మాదకద్రవ్యాలు వినియోగం పెరగడం బాధాకరమైన విషయమని 15 సంవత్సరాల లోపు పిల్లలు మొదలుకొని యువకులను ప్రజలను మాదకద్రవ్యాలకు వ్యసనంగా మారి క్రమ క్రమంగా వ్యసనపరులుగా మార్చి వేస్తున్నారని, ఇది వారి ఆరోగ్యాన్ని తద్వారా వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులను గుల్ల గుల్లగా చేస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. మీర్పేట్ పరిధిలోని బాలాపూర్ చౌరస్తా దగ్గర రక్తమైసమ్మ గుడి ఎదురుగా లెనిన్ నగర్ లో నిర్మాణంలో ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇండ్ల దగ్గర మీర్పేట్ చెరువులోని అల్మాస్గూడలోని రాజీవ్ గృహకల్ప గాంధీ నగర్ బస్తీ తదితర ప్రాంతాలలో ప్రధానంగా మాదకద్రవ్యాల అమ్మకం సేవలను కొనసాగుతున్నట్లు వారి దృష్టికి తీసుకువెళ్లారు. వీటి పట్ల ప్రత్యేక దృష్టి సారించి మాదకద్రవ్యాల అమ్మకం, అమ్మకం దారుల పట్ల కఠిన వైఖరి చేపట్టి ప్రజలను ముఖ్యంగా పిల్లలను యువకులను వీటి భారీ నుంచి రక్షించాలని ప్రగతిశీల యువజన సంఘం విజ్ఞప్తి చేశారు. దీనిపై ఇన్స్పెక్టర్ కాశి విశ్వనాథ్ సానుకూలంగా స్పందిస్తూ అమ్మకాలపై కఠిన చర్యలు తీసుకుంటామని యువకులలో ప్రజలలో వీటి పట్ల అవగాహన కార్యక్రమాలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల యువజన సంఘం నగర అధ్యక్షులు కార్యదర్శులు ఎం రవికుమార్, బిఎస్ కృష్ణ, బాలాపూర్ ఏరియా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కె రాకేష్, కే భీమేష్ ఉపాధ్యక్షులు ఎన్ నాగరాజు, సహాయ కార్యదర్శి కే శంకర్ నాయకులు, జి మహేష్ ఎన్ కాశీనాథ్, శేఖర్, పాల్గొన్నారు.



## వ్యక్తి అదృశ్యం

జల్ పల్లి, మేజర్ న్యూస్ (జూన్ 11):వ్యక్తి అదృశ్యమైన సంఘటన పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం. మహేశ్వరం మండలం తుక్కుగూడ గ్రామానికి చెందిన గంజి నాగేశేశమ్మ భర్త గంజి అంకం రావు వయస్సు 36 సంవత్సరాలు. 20 రోజుల క్రితం తాపీ పని నిమిత్తం అల్వాల్ కు వెళ్ళాడు. ఈనెల 7న సుమారు 7 గంటలకు ఆమె భర్త ఆమెతో ఫోన్ లో మాట్లాడాడు. తర్వాత ఆమె భర్త మొబైల్ నెంబర్ కు ఫోన్ చేయగా అది స్విచ్ ఆఫ్ అని చూపుతోంది. తన భర్త సహోదయోగులను విచారించగా తన భర్త అంకం రావు నాలుగు రోజులు పని చేసి, ఇంటికి వెళుతున్నాను అని చెప్పి అక్కడ నుండి వెళ్లిపోయాడన్నారు. దీంతో ఆమె అతని గురించి చుట్టుపక్కల ప్రాంతాల్లో బంధువుల్లో వెతికిన ఫలించలేదు. కావున తగు చర్యలు తీసుకోవాలని గంజి నాగశేషమ్మ పహాడి షరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## నీట్ ఫలితాలలో సీటు సాధించిన సితా ప్రనూష

▶▶ ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు ప్రఖ్యాతలు తేవాలి

▶▶ స్థానిక కార్పొరేటర్ సూర్ణ గంటి అర్జున్



బాలాపూర్ మేజర్ న్యూస్( జూన్ 11): ఇటీవల విడుదల చేసిన నీట్ ఫలితాలలో సీతాప్రనూష 2024 నీట్ ఫలితాలలో సీటు సాధించడం హర్షనీయమని 28వ డివిజన్ స్థానిక కార్పొరేటర్ సూర్ణ గంటి అర్జున్ అన్నారు. బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని 28వ డివిజన్ శ్రీనిలయ టౌన్షిప్ లో నివసిస్తున్న సంతోష- కృష్ణ దంపతులు కుమార్తె సీతాప్రనూష 2024 నీట్ ప్రవేశ పరీక్ష ఫలితాలలో 720 మార్కులకు అత్యధిక 640 మార్కులు రావడం స్థానిక కార్పొరేటర్ ఎస్.అర్జున్ వారి నివాసానికి వెళ్లి సీతా ప్రనూష ను మనస్ఫూర్తిగా అభినందించి శాలువాతో సత్కరించారు. ఆమె తల్లిదండ్రులకు ప్రఖ్యాతలు తీసుకొచ్చిందని కొనియాడారు. ఈ సందర్భంగా ఎస్ అర్జున్ మాట్లాడుతూ... పట్టుదల కృషిని మెచ్చుకోవడం ఇదే స్ఫూర్తితో ఉన్నత చదువులు చదివి గొప్ప డాక్టర్ అయ్యి ప్రజలకు సేవ చేయాలని శ్రీనిలయ కాలనీకి తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీ నిలయ కాలనీ పెద్దలు 28వ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల పెద్దలు పాల్గొని వారి కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు.

## సెల్ ఫోను పోగొట్టుకున్న వ్యక్తికి ..సెల్ ఫోన్ అందజేత



యాచారం మేజర్ న్యూస్ (జూన్ 11) సెల్ ఫోన్ పోగొట్టుకున్న ఓ వ్యక్తికి పోలీసులు దర్యాప్తు చేసి సెల్ ఫోన్ తిరిగి అందజేశారు. మండలంలో మంగళవారం మేడిపల్లిలోని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని తాడిపర్తి గ్రామానికి చెందిన పాలమోని వెంకటేష్ తను సెల్ఫోన్ పోగొట్టుకున్నట్లు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు పోగొట్టుకున్న సెల్ ఫోన్ ఐఎంఈఐ దరఖాస్తుల్లో నమోదు చేసి దర్యాప్తు చేయగా సెల్ ఫోన్ దొరికిందని పేర్కొన్నారు. దొరికిన సెల్ ఫోన్ ను బాధిత వ్యక్తి పాలమోని వెంకటేష్ కు అందజేసినట్లు పేర్కొన్నారు. పోగొట్టుకున్న సెల్ ఫోన్ విషయంలో ఎవరు ఆందోళన చెందవద్దని సెల్ ఫోన్ విషయమై పోలీస్ స్టేషన్లో వెంటనే దరఖాస్తు ఇవ్వాలని ఎస్సై సూచించారు.

## గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



ఇబ్రహీంపట్నం, మేజర్ న్యూస్ (జూన్ 11): గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేసిన తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ రిటైర్డ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి పి దేవేంద్ర రావు. మంగళవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ కేంద్రంలోని గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చదువు అందరికీ అవసరమని చదువుతూనే భవిష్యత్తుని తీర్చిదిద్దుకోగలమని అన్నారు. మంచి వాతావరణం ఈ ఉన్న గ్రంథాలయంలో విద్యార్థులు పట్టుదలతో చదువుకొని ఉన్నతమైన ఉద్యోగాలను పొందాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమం ను వారి తల్లిదండ్రులు కీ.శే. రాములు, కీ.శే. తులసిరత్నం గార్ల జ్ఞాపకార్థం చేశాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రూప్1 అధికారుల సంఘం, ఆర్గనైజింగ్ సెక్రటరీ నూతన గంటి వెంకట్, పోటీ పరీక్షల నిపుణులు, గ్రంథాలయ లైబ్రేరియన్ కొప్పు యాదయ్య లు తదితరులు పాల్గొన్నారు.

## నేడు కరణ్‌కోట్‌కు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి రాక



తాండూరు రూరల్, మేజర్‌న్యూస్ (జూన్ 11)ః తాండూరు మండలం కరణ్ కోట్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో బడి బాట కార్యక్రమంలో భాగంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలను ఎమ్మెల్యే బి. మనోహర్ రెడ్డి పంపిణీ చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నాగప్ప పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు.

## మోత్కూర్ ముగిసిన క్రికెట్ టోర్నమెంట్
### విజేతలుగా మోత్కూర్ టీం..



దోమ, మేజర్‌న్యూస్ (జూన్ 11)ః దోమ మండల పరిధిలో ని మోత్కూర్ గ్రామంలో నిర్వహించిన జిల్లాస్థాయి రూరల్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ముగిసింది. ఫైనల్ మ్యాచ్ మోత్కూర్ వర్సెస్ మల్కాపూర్ జట్ల మధ్య హోరాహోరిగా ఆడారు. దీంట్లో మల్కాపూర్ గ్రామం విజేత జట్టుగా నిలిచింది. విజేతలకు మొదటి బహుమతి రూ. 30,000, మల్కాపూర్ గ్రామానికి రెండవ బహుమతి రూ. 15,000 ట్రోఫీలను కేఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ అందించారు. ఈ కార్యక్రమంలో లింగయ్య,సుధాకర్ రెడ్డి,శంకర్, మోత్కూర్ గ్రామ క్రికెట్ అసోసియేషన్ సభ్యులు,క్రీడాకారులు, యువకులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## వీధి నాటకానికి విరాళం
### అందజేసిన పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



దోమ, మేజర్‌న్యూస్ (జూన్ 11)ః దోమ మండల పరిధిలో ని బాస్ పల్లి గ్రామంలో కురుక్షేత్ర వీధి నాటకంకు రూ. 20000 లను ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అనుచరుల ద్వారా అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు పద్మ శ్రీనివాస్, అనంతయ్య, టి వెంకటయ్య, శ్రీనివాస్ గ్రామస్తులుపాల్గొన్నారు.

## మత్స్య కార్మిక సంఘం నూతన కమిటీ ఎన్నికల



దోమ మేజర్‌న్యూస్ (జూన్ 11)ః దోమ మండల పరిధిలోని గుముడల్ గ్రామంలో ప్రాథమిక మత్స్య పారిశ్రామిక మార్కెటింగ్ సహకార సంఘం లిమిటెడ్ సీనియర్ ఇన్స్పెక్టర్,ఎలక్షన్ ఆఫీసర్ సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఎనుకున్నారు. ప్రెసిడెంట్, బోయిని పెద్ద వెంకటయ్య, వైస్ ప్రెసిడెంట్ సాతునూరి చిన్న దస్తయ్య, సెక్రెటరీ కుక్కల మహేష్, మేనేజింగ్ కమిటీ మెంబర్స్, తోగపురం నర్సింలు, సాతులూరి సాయప్ప, కే అశోక్, బోయిని దస్తయ్య, బోయిని వెంకటయ్య, బోయిన అశోక్, వీరిని 40 మంది కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.




## పెండింగ్ పీఆర్‌సి విడుదల చేయడం సంతోషకరం



దోమ, మేజర్ న్యూస్ (జూన్ 11)ః గతంలో ప్రతి నెలకు 2550 రూపాయలు పెరిగిన పిఆర్సి 21 నెలల పెండింగు పిఆర్సి గోపాల మిత్రులకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర డిప్యూటీ ముఖ్య మంత్రి బట్టి విక్రమార్క విడుదల చేసినందుకు రాష్ట్ర గోపాలమిత్ర తరఫునుంచి వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర గోపాల మిత్ర ఉపాధ్యక్షుడు గోపాల మిత్రకేశవులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## రేణుక ఎల్లమ్మ అమ్మవారి జాతరకు పోటెత్తిన భక్తులు



తాండూరు రూరల్, మేజర్‌న్యూస్ (జూన్ 11)ః భక్తుల కొంగు బంగారం కొల్లాపూర్ రేణుక ఎల్ల మ్మ అమ్మవారి జాతర జరుగుతుంది. తాండూరు మండలం కొత్లాపూర్ శివారులో ఉన్న శ్రీ రేణుక ఎల్లమ్మ జాతర నెల రోజుల పాటు కొనసాగడంతో మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మ సల్లంగ చూడు తల్లి అంటు మొక్కులు తీర్చుకున్నారు . డప్పు వాయిధ్యం బోనాలతో మహిళలు ఆలయం చుట్టు ప్రదక్షణ చేశారు. ఆ తర్వాత అమ్మవారికి నైవేధ్యం సమర్పిం చారు. తాండూరు ప్రాంతాంలోని గ్రామాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవా రిని దర్శించుకున్నారు. ఈ నెల 22వ తేదీ వరకు జాతర కొనసాగుతుందని ఆలయ ఈవో శేఖర్ గౌడ్ తెలిపారు . ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ సందీప్ రెడ్డి, నాయకులు నవీన్ రెడ్డిలతో పాటు భక్తులు ఉన్నారు.



పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్న బక్తులు

## తీన్మార్ మల్లన్నకు శుభాకాంక్షలు



శామీర్ పేట, మేజర్ న్యూస్ (జూన్ 11) : ఇటీవల జరిగిన ఖమ్మం, వరంగల్, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి చింతపండు నవీన్ (తీన్మార్ మల్లన్న) విజయం సాధించిన సందర్భంగా మంగళవారంమూడు చింతలపల్లి మండలం లక్ష్మాపూర్ గ్రామ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు లగిశెట్టి దయానంద్ పటేల్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మాపూర్ మాజీ సర్పంచ్ సింగం ఆంజనేయులు పటేల్, మున్నూరుకాపు సంఘం ప్రధాన కార్యదర్శి క్యాతం రవి, మాజీ అధ్యక్షుడు సింగం నర్సింగ్ రావు, సంఘం ప్రతినిధులు సింగం పవన్ కుమార్, సింగం భాస్కర్, సింగం రాకేష్, సింగం భాస్కర్, లగిశెట్టి అరుణ్ పాల్గొన్నారు.

## శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద అన్నదానం



శామీర్‌పేట, మేజర్ న్యూస్ (జూన్,11) : శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్నదానం నిర్వహించారు. మండల కేంద్రం శామీర్‌పేటలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఓడి బియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. లాల్ గడి మలక్ పేట గ్రామానికి చెందిన బిర్కు రి సాయిబాబా యాదవ్‌తో పాటు పలువురు భక్తులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. వివిధ గ్రామాల భక్తులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.



## ఇంటింటికి మంచినీటి సరఫరాపై ఎండివో విచారణ
### కీసరలో ప్రతి కనెక్షన్ ఆన్లైన్ ఎంట్రీ



కీసర,మేజర్ న్యూస్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు కీసర మండలంలో మిషన్ భగీరథ పథకంపై అధికారులు గ్రౌండ్ రిపోర్ట్ కై విచారణ చేపట్టారు. మంగళవారం కీసర మండల ఎంపిడివో పి.గామ్య పంచాయతి సిబ్బందితో కలసి ఇంటింటికి కలియతిరిగారు. ఇంటింటికి ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ మంచినీటి కనెక్షన్లను పరిశీలించి నీటి సరఫరాపై ఆ ఇంటిసభ్యుల నుండి వివరాలు ఆడిగితెలుసుకున్నారు. నల్ల కనెక్షన్, కుటుంబ సభ్యుల వివరాలను యాప్ ద్వారా ఆన్లైన్ ఎంట్రీ చేసి ఉన్నత అధికారులకు సమాచారం ఎండివో చేరవేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గంగ న్న, బిల్ కలెక్టర్ బాల్ నరసింహ పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత
### ఆర్బిఎల్ ఎండి శ్రీనివాస్ రెడ్డి



పూజా కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాస్ రెడ్డి.

కుల్కచర్ల రూరల్, మేజర్‌న్యూస్ (జూన్ 11)ఃఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఆర్బిఎల్‌ఎండి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కుల్కచర్ల మండలం తిర్మలాపూర్ గ్రామంలో ఎల్లమ్మ తల్లి ఆలయ పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ... ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణతో మానశిక ప్రశాంతత నెలకొంటుందని, వ్యక్తి మానశిక పరివర్తనలో మార్పు, ఆలోచన విధానంలో మార్పు పొందడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, ఎంపీటీసీ రాంలాల్, శంకర్, రవి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలలో గెలుపు, ఓటములు సహజమే...
### తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి



విజేతలకు బహుమతులు ప్రధానం చేస్తున్న తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి.

బషీరాబాద్,మేజర్‌న్యూస్( జూన్ 11): క్రీడాలలో గెలుపు,ఓటములు సహజమేనని తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి తెలిపారు.మంగళవారం ఆయన బషీరాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో ఆసిఫ్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా ఫైనల్ మ్యాచ్ లో విజేతగా నిలిచిన అర్మాన్ 11 జట్టుకు, రన్నర్ గా నిలిచిన బాజిగర్ జట్టుకు స్థానిక నాయకులతో కలిసి బహుమతులు ప్రధానం చేశారు.అనంతరం క్రికెట్ టోర్నమెంట్ కు తన వ్యక్తిగతంగా రూ.25,000/- అందించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,తదితరులు పాల్గొన్నారు.